

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోంది. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల విజయానికి కూటమి పార్టీల శ్రేణులు ఐక్యంగా పనిచేస్తాయి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శనివారం 31.10.2026

INK OF TRUTH

జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 190 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

ప్రతి బాధితుడికీ న్యాయం

- రైతులు, మత్స్యకారులను ఆదుకుంటాం
- పంట నష్టంపై సమగ్ర అంచనాలు
- విద్యుత్ పునరుద్ధరణకు అదనపు సిబ్బంది
- డెల్టా కాలువల ఆధునీకరణతో ముంపునకు చెక్
- బాధితులకు స్వయంగా సరుకులు పంపిణీ చేసిన చంద్రబాబు

నరసాపురం, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్) : అర్నబ్ తుఫాను కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులు, నష్టాలకు గురైన కొబ్బరి రైతులు, మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. తుఫాను కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనలో భాగంగా రెండో రోజు పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని పరిశీలించి, రైతులు, మత్స్యకారులు, స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నరసాపురం మండలం కొత్త నవరసపురంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించిన ముఖ్యమంత్రి రైతులతో మాట్లాడారు. పంట నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేసి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. రైతులు పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. ఇ-పంట విధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టం జరిగినప్పుడు బీమా ద్వారా పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ కూడా రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. రైతులు కష్టపడి పండించిన పంటకు నష్టం వాటిల్లకుండా చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పంట కాలువల్లో నీటి ప్రవాహం సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన గోదావరి డెల్టా కాలువల ఆధునీకరణకు రూ. 3 వేల కోట్లు కేటాయించామని, పనులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. రైతులు ప్రకృతి సేద్యం వైపు మొగ్గు చూపాలని సూచించారు.

2 లో

ఎస్ఐఆర్ గడువు మళ్లీ పెంపు

- ఏపీలో ఎస్ఐఆర్ షెడ్యూల్ పొడిగించిన ఈసీ
- నవంబరు 20 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ
- 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణ
- ఆరు రాష్ట్రాల్లో సవరించిన షెడ్యూల్ అమలు

2 లో

మళ్లీ గెలుస్తాం.. యూసీసీ తెస్తాం

- వచ్చే ఏడాది ఎన్నికల్లో బీజేపీదే విజయమన్న అమిత్ షా
- అధికారంలోకి రాగానే ఉమ్మడి పౌరస్మృతి అమలు
- యూపీలో బీజేపీ సర్కారును కదిలించలేరని వ్యాఖ్య
- అఖిలేశ్ పార్టీకి మరో 30 ఏళ్లు అధికారం దక్కదని విమర్శ

2 లో

తుది శ్వాస వరకు ప్రజాసేవే

- దేశం కష్టాల్లో ఉంటే కొందరు సంతోషిస్తున్నారు
- విపత్తుల వేళ దుష్ప్రచారం.. ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ ఆగ్రహం
- రైతులపై ఎరువుల ధరల భారం పడకుండా కేంద్రం చర్యలు
- పీఎం-కిసాన్ ద్వారా ఇప్పటివరకు రూ.4.5 లక్షల కోట్లు జమ

2 లో

బనాస్కాంత (గుజరాత్) (జర్నలిస్ట్ ఫైల్) : తన జీవితంలో చివరి శ్వాస వరకు ప్రజాసేవలోనే నిమగ్నమై ఉంటానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశ ప్రజలే తన విజయాలకు, పురోగతికి మూలమని పేర్కొన్నారు. శుక్రవారం గుజరాత్‌లోని బనాస్కాంత జిల్లాలో పర్యటించిన ఆయన.. 'భారత్ బోవైన్ బ్రీడింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్'ను ప్రారంభించారు. సుమారు రూ. 14 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు.

సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తనకు తొలుత గుజరాత్, ఆ తర్వాత దేశ ప్రజలకు సేవ చేసే గొప్ప బాధ్యతను అప్పగించారని మోదీ గుర్తు చేసుకున్నారు. తన కుటుంబంలో ఏ తరంలోనూ కనీసం పంచాయతీ సర్పంచిగా కూడా ఎవరూ పనిచేయలేదని చెప్పారు. అలాంటి నేపథ్యం నుంచి వచ్చిన తనకు ప్రజలు ఇంతటి అవకాశం కల్పించారని పేర్కొన్నారు. సాధించిన ప్రతి విజయం, పొందిన ప్రతి పురోగతికి దేశ ప్రజలే కారణమని.. వారి రుణాన్ని ఎప్పటికీ తీర్చుకోలేనని అన్నారు. జీవితాంతం ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు.

సంక్షోభ వేళల్లోనూ దుష్ప్రచారం : దేశం ఏదైనా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పుడు కొందరు సంతోషించే మనస్తత్వంతో వ్యవహరిస్తున్నారని మోదీ విమర్శించారు.

మత్స్యకారులకు శాశ్వత భరోసా

- తీర ప్రాంత సమస్యలకు శాశ్వత పరిష్కారాలపై పవన్ దృష్టి
- వేట పడవలకు బీమా సౌకర్యంపై ప్రతిపాదనలు
- ఉప్పాడ రక్షణ గోడ పనులు వేగవంతం చేయాలి
- దీపావళి తర్వాత మత్స్యకార గ్రామాల్లో పర్యటన
- బాధితులకు న్యాయం జరిగేలా నష్టాల అంచనా

• వివరాలు 2 లో

కాకినాడ (జర్నలిస్ట్ ఫైల్): తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా అధికారులను ఆదేశించారు. తుపానులు వచ్చిన ప్రతిసారీ తాత్కాలిక చర్యలు చేపట్టడం కాకుండా, తీర ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వేట పడవలకు బీమా సౌకర్యం కల్పించే అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి, తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. దీపావళి తర్వాత మత్స్యకార గ్రామాల్లో పర్యటించి, వారి సమస్యలపై స్వయంగా అధ్యయనం చేస్తానని తెలిపారు.

పురపోరుకు భారీ భద్రత

- 36,351 మంది పోలీసులతో బందోబస్తు
- 4,372 ప్రాంతాల్లో ఎన్నికల పర్యవేక్షణ
- నవంబరు 1న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- వర్షాలు, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో నవంబరు 1న జరగనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు భారీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ కార్యాలయం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 4,372 ప్రాంతాల్లో 36,351 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పత్రికా ప్రకటనలో తెలిపింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి అక్టోబరు 15 నుంచి 29వ తేదీ వరకు 261 కేసులు నమోదు చేసినట్లు పేర్కొంది.

2,726 నాన్‌బెయిలబుల్ వారెంట్ల అమలు : ఎన్నికల నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న 2,726 నాన్‌బెయిలబుల్ వారెంట్లను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేశారు. అత్యధికంగా తిరుపతిలో 61, కడపలో 36, అన్నమయ్య జిల్లాలో 31, అనంతపురంలో 26, మార్కాపురం జిల్లాలో 22 వారెంట్లను అమలు చేశారు. ఈ చర్యల్లో భాగంగా 107 మందిని అరెస్టు చేయగా.. 733 మందికి భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా 1,05,767 మందిని బైండోవర్ చేశారు. - 2లో...

జిఎస్ఎల్వి-ఎఫ్18 రాకెట్ ప్రయోగం విజయవంతం

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ప్రయోగించిన జిఎస్ఎల్వి-ఎఫ్18 రాకెట్ విజయవంతంగా నింగిలోకి చేరింది. శుక్రవారం రాత్రి 11 గంటల 51 నిమిషాలకు రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్ ద్వారా నావిక్ సిరీస్‌కు చెందిన నావిక్-03 ఉపగ్రహాన్ని జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి, అనంతరం ప్రొపల్షన్ వ్యవస్థ సహాయంతో ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి చేరింది. దేశీయ నావిగేషన్, పొజిషనింగ్ సేవలను మరింత బలోపేతం చేయడమే ఈ ప్రయోగం ప్రధాన లక్ష్యంగా ఈ ప్రయోగాన్ని చేపట్టారు. ప్రైవేట్ ప్రయోగంతో కలిపి ఈ ఏడాది జనవరి నుంచి ఇస్రో చేపడుతున్న ఐదో రాకెట్ ప్రయోగం. మిగతా 2లో...

పురపోరుకు ప్రచార తెర

- నవంబరు 1న పోలింగ్.. 3న ఫలితాలు
- 17 మున్సిపల్ ఛైర్మన్ పదవులు కూటమికి ఏకగ్రీవం
- 36,351 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- సమస్యాత్మక కేంద్రాలపై డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా

అమరావతి: మైకుల హోరు.. ర్యాలీల జోరు.. నేతల మాటల తూటాలు.. ఓటర్లను ఆకట్టుకునేందుకు హామీల వర్షం! గత కొన్ని రోజులుగా పట్టణాల్లో హోరెత్తిన ఎన్నికల ప్రచార సందడి ముగిసింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ప్రచారానికి తెరపడింది. నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందే ప్రచారాన్ని నిలిపివేశారు. ఇక అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు తేల్చనున్నారు. నవంబరు 1న పోలింగ్, 3న ఓట్ల లెక్కింపు జరగనుంది.

ముందే 17 ఛైర్మన్ పదవులు ఏకగ్రీవం : పోలింగ్‌కు ముందే అధికార తెదేపా-జనసేన-భాజపా కూటమి 17 మున్సిపల్ ఛైర్మన్ పదవులను ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. వీటిలో తెదేపా 15, జనసేన, భాజపా ఒక్కొక్కటి చొప్పున దక్కించుకున్నాయి. ముఖ్యంగా వైఎస్సార్ కడప జిల్లాలో ఆరు పట్టణ స్థానిక సంస్థలు కూటమి ఖాతాలో చేరాయి. ఛైర్మన్ పదవులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 21 శాతానికి పైగా వార్డులు, 12 శాతానికి పైగా డివిజన్లు ఏకగ్రీవమయ్యాయి. 13 కార్పొరేషన్ల పరిధిలోని 922 డివిజన్లకు గాను 118 చోట్ల పోటీ లేకుండానే కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. పిడుగురాళ్ల, దాచేపల్లి, ప్రొద్దుటూరు, మిగతా 2లో...

తుది శ్వాస వరకు ప్రజాసేవే

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న సమయంలో దేశంలో ఎరువుల కొరత ఏర్పడుతుందని, వంటగ్యాస్ సరఫరా నిలిచిపోతుందని కొందరు ఉద్దేశపూర్వకంగా పుకార్లు సృష్టించారని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా అసత్య ప్రచారానికి దిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు భారీగా పెరిగినా.. ఆ భారాన్ని భారతీయ రైతులపై పడకుండా కేంద్ర ప్రభుత్వమే భరించిందని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా ఎరువులు, గ్యాస్ కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని వివరించారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం : దేశానికి అన్నదాతలే మూలస్తంభాలని ప్రధాని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు. చిన్న, సన్నకారు రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు 'పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి' పథకం ద్వారా ఇప్పటివరకు రూ. 4.5 లక్షల కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, పశుసంవర్ధక రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తున్నామని తెలిపారు.

బనాస్కాంత రైతుల కృషి ఆదర్శం : బనాస్కాంత జిల్లా వ్యవసాయ, సహకార రంగాల్లో సాధించిన ప్రగతిని మోదీ ప్రత్యేకంగా ప్రశంసించారు. అక్కడి రైతుల శ్రమ, పట్టుదల దేశానికే ఆదర్శమని కొనియాడారు. ఈ ప్రాంతంలో పండించే బంగాళాదుంపలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. 'బంగాళాదుంపల నుంచి బంగారం తయారు చేసి ఇస్తాం' అని ఇక్కడి రైతుల వద్దకు వచ్చి ఎవరూ చెప్పలేరని వ్యాఖ్యానించారు. ఎందుకంటే తమ కష్టంతో బంగాళాదుంపల సాగు ద్వారా బంగారం లాంటి దిగుబడులు ఎలా సాధించాలో ఈ ప్రాంత రైతులకు బాగా తెలుసని మోదీ పేర్కొన్నారు.

మళ్లీ గెలుస్తాం.. యూసీసీ తెస్తాం

లక్నో (జర్నలిస్ట్ ఫైల్) : ఉత్తరప్రదేశ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. యుపిలో మళ్లీ బిజెపినే అధికారంలోకి వస్తుందని, అప్పుడు రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి)ని అమల్జేస్తామని ప్రకటించారు. ఇప్పటికే దీనిని అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం యుపిలో బిజెపి ప్రభుత్వం సుస్థిరంగా ఉందని, దానిని ఎవరూ కదిలించలేరని వ్యాఖ్యానించారు. 'యుపిలో బిజెపి ప్రభుత్వం అంగదుడి పాదం (కదిలించలేనిది) లాంటిది. దీనిని ఎవరూ కదిలించలేరు. బిజెపి మళ్లీ యుపిలో ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు" అని ఆయన పేర్కొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ ఇకపై యుపిలో అధికారంలోకి రాదని పేర్కొన్నారు. 'అఖిలేశ్ బాబూ, గుర్తుంచుకోండి. వచ్చే 30 ఏళ్ల వరకు మీ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. ప్రజలు మీ మూడో తరానికి కూడా క్షమించరు" అని ఆయన సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశించి అన్నారు. అయితే ఇటీవల జరిగిన శాసనమండలి ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజవర్గాలు రెండింటిలోనూ బిజెపి పరాభవం పాలైంది. ఈ నేపథ్యంలో అఖిలేశ్ మాట్లాడుతూ యుపిలో బిజెపికి రోజులు దగ్గరపడుతున్నాయని పేర్కొన్న సంగతి తెలిసిందే.

ఎస్ఐఆర్ గడువు మళ్లీ పెంపు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి పొడిగించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో ఐదు రాష్ట్రాల్లో సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. తాజా నిర్ణయం ప్రకారం నవంబరు 20 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. నవంబరు 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

నవంబరు 20 వరకు అవకాశం : రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువును ఈసీ పొడిగించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. ఈ ప్రక్రియకు జులై 1ను అర్హత తేదీగా నిర్ణయించి, జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించినట్లు వివరించారు. తొలుత అక్టోబరు 22 వం-కు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించి.. అదే నెల 30న తుది జాబితా ప్రచురించాలని నిర్ణయించామన్నారు. ఈసీ తాజా ఉత్తర్వుల ప్రకారం నవంబరు 20 వరకు వాటిని స్వీకరిస్తామని, 30న తుది ఓటర్ల జాబితాను వెల్లడిస్తామని తెలిపారు.

ఆరు రాష్ట్రాల్లో షెడ్యూల్ మార్పు : దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల్లో పారదర్శకత పెంచడం, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులు, ద్వంద్వ ఓట్లను గుర్తించడం లక్ష్యంగా ఈసీ ఎస్ఐఆర్ చేపట్టింది. ఇప్పటికే బిహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, ఉత్తర్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తయింది.

మూడో దశలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దిల్లీ, హరియాణా, మహారాష్ట్ర, నాగాలాండ్‌లలో ఈ ఏడాది మే 14న ప్రారంభించారు. ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల అభ్యర్థనల మేరకు గడువును పొడిగిస్తూ ఈసీ నిర్ణయం తీసుకుంది.

దిల్లీకి ప్రత్యేక గడువు : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హరియాణా, మహారాష్ట్ర, నాగాలాండ్‌లలో నవంబరు 30న తుది ఓటర్ల జాబితాలను ప్రచురించనున్నారు. దిల్లీలో మాత్రం డిసెంబరు 12 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. అక్కడ తుది జాబితాను డిసెంబరు 22న విడుదల చేయనున్నారు. ఈ దశ పూర్తయితే జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, లద్దాఖ్ మినహా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ ముగియనుంది.

ప్రతి బాధితుడికీ న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

దీనివల్ల పంటలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుందన్నారు.

15 వేల విద్యుత్ స్తంభాలు నేల కూలాయి : తుఫాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేల కూలాయని సీఎం తెలిపారు. రేపు సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని ప్రకటించారు. తొలుత గృహాలకు, ఆ తర్వాత వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు. అవసరమైన అదనపు సిబ్బందిని తెలంగాణ నుంచి కూడా రప్పిస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ పునరుద్ధరణ పనులను స్వయంగా పరిశీలించిన ముఖ్యమంత్రి.. కార్మికులతో కలిసి విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టేందుకు సీఎం సహకరించారు. విపత్కర పరిస్థితుల్లోనూ శ్రమిస్తున్న విద్యుత్ సిబ్బంది, కార్మికులను ముఖ్యమంత్రి అభినందించారు. పశ్చిమగోదావరి జిల్లాలోనే 12,500 చెట్లు నేల కూలాయని, వాటి వ్యర్థాలను త్వరితగతిన తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తుఫాను గాలుల కారణంగా కొబ్బరి చెట్లు, వరి పంటలు దెబ్బతిన్నాయని, బాధిత రైతులకు న్యాయం చేస్తామన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థలోనూ కొంత అంతరాయం ఏర్పడిందని, ప్రైవేటు టెలికాం టవర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సిగ్నల్స్ సమస్య తలెత్తిందని తెలిపారు. వీటిని కూడా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామన్నారు.

తుఫాను షెల్టర్లలో బాధితులకు భరోసా : మొగల్తూరు మండలం మాత్రేవు గ్రామంలోని తుఫాను షెల్టర్‌ను ముఖ్యమంత్రి సందర్శించారు. నాలుగు రోజులుగా అక్కడ ఆశ్రయం పొందుతున్న మహిళలు, ఇతర బాధితులతో మాట్లాడారు. తుఫాను తీరం దాటే సమయంలో తీవ్ర ఆందోళనకు గురయ్యామని వారు సీఎంకు వివరించారు. తుఫాను ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని, అందువల్ల ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించ గలిగామని సీఎం తెలిపారు. వశిష్ట గోదావరిలో ఎదురవుతున్న సమస్యలను మత్స్యకారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సముద్ర ముఖద్వారం వద్ద కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించి, మత్స్యకారులు సులభంగా చేపల వేట సాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

కేంద్ర బృందం కూడా పర్యటిస్తుంది : మాత్రేవు గ్రామంలోని తుఫాను షెల్టర్ సందర్శన అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ.. అర్నబ్ తుఫాను ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించానన్నారు. ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ముందస్తు చర్యలు తీసుకుందని చెప్పారు. రాత్రంతా సమీక్షలు నిర్వహిస్తూ వాతావరణ పరిస్థితులను అంచనా వేసి ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేశామని వివరించారు. కలెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేశామని తెలిపారు. గతంతో పోలిస్తే ప్రాణ నష్టాన్ని భారీగా తగ్గించగలిగామని, దురదృష్టవశాత్తూ ఏడుగురు మృతి చెందారని విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించామన్నారు. తుఫాను వల్ల ప్రాథమికంగా రూ. 4,600 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా వేసి కేంద్రానికి నివేదిక పంపించామని, పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేసి మరో నివేదిక అందిస్తామని తెలిపారు. నష్ట తీవ్రతను అంచనా వేసేందుకు కేంద్ర బృందం కూడా రాష్ట్రంలో పర్యటిస్తోందని చెప్పారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసిందని, ప్రజల భాగస్వామ్యంతో విపత్తును సమర్థంగా ఎదుర్కొన గలిగామని సీఎం అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువులను నింపేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ : పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులను శుక్రవారం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ఏడాదికి మూడు విడతల్లో మొత్తం రూ. 20 వేలు అందిస్తామని ఇచ్చిన హామీలో భాగంగా రెండో విడతగా రూ. 7 వేల చొప్పున రైతులకు జమ చేశామన్నారు. తుఫాను కారణంగా పంటలు నీట మునిగిన రైతులను కూడా ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. తుఫాను బాధిత కుటుంబాలకు బియ్యంతో పాటు కందిపప్పు, వంటనూనె, బంగాళదుంపలు తదితర నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామని సీఎం తెలిపారు. సహాయ కార్యక్రమాల్లో భాగంగా బాధితులందరికీ ప్రభుత్వం ప్రకటించిన రేషన్ అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. తుఫాను వల్ల నష్టపోయిన చిట్టచివరి వ్యక్తికి కూడా న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నప్పటికీ తుఫాను బాధితుల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. మీడియా సమావేశం అనంతరం ముఖ్యమంత్రి తుఫాను బాధితులకు స్వయంగా రేషన్ సరుకులు పంపిణీ చేశారు. సీఎం వెంట మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ సహా ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

మత్స్యకారులకు శాశ్వత భరోసా

(మొదటి పేజీ తరువాయి)

అర్నబ్ తుపాను ప్రభావం, సహాయక చర్యలు, బాధితులకు అందుతున్న సాయం తదితర అంశాలపై కాకినాడ జిల్లా యంత్రాంగం, తీర ప్రాంత గ్రామాల ప్రజలతో క్యాంపు కార్యాలయం నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, తీర ప్రాంత గ్రామాలకు చెందిన మత్స్యకారులతో తుపాను కారణంగా జరిగిన నష్టం, సహాయక చర్యల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సహాయక చర్యలను సమీక్షించి, పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు.

ముఖ్యంగా ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడకు సంబంధించి డిజైన్ రూపకల్పన, డీపీఆర్ తదితర పనులు వేగవంతం చేయాలని, సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. కోనపాపపేట వరకు రక్షణ గోడ పొడిగింపు అంశంపై గతంలో స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థకు చేసిన ప్రతిపాదనలు త్వరితగతిన ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు పునరుద్ధరణకు తక్షణ చర్యలు : ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు తుపాను అలల తాకిడికి పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తీర ప్రాంత ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో ప్రజలకు సత్వర ఉపశమనం : కాకినాడ జిల్లావ్యాప్తంగా 92 తీర ప్రాంత ఆవాసాల నుంచి 10 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, 102 పునరావాస కేంద్రాల్లో వారందరికీ ఆశ్రయం కల్పించడం పట్ల జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సహాయక చర్యలను నిరంతరం కొనసాగించాలని సూచించారు. సూరాడపేట, మాయాపట్నం, కొత్తపట్నం, నాయకర్ కాలనీల్లోకి సముద్రపు నీరు చొచ్చుకురావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ విషయాన్ని తెలియజేసిన వెంటనే స్పందించి, 24 గంటల్లో నీటిని పూర్తిగా తొలగించిన జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు.

తుపాను గాలుల కారణంగా పిఠాపురం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తుపాను ప్రభావం తగ్గిన వెంటనే విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టినప్పటికీ, భోగాపురం, నరసింగపురం, చిత్రాడ ఎస్సీ కాలనీ, మల్లం, విరవాడ మధ్య విద్యుత్ స్తంభాలు పడిపోయాయని వివరించారు. కొన్ని చోట్ల పునరుద్ధరణ తర్వాత వైర్లు కాలిపోయినట్లు తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ త్వరగా పరిష్కరించి, విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని అధికారులకు స్పష్టం చేశారు.

నష్టం అంచనాలను త్వరగా పూర్తి చేయాలి : తుపాను కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, పంటలు, బోట్లు, వలలు, మగ్గాలకు ఎన్యూమరేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నష్టాలపై సమగ్ర అంచనాలు రూపొందించి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని నిర్దేశించారు. రైతులు, మత్స్యకారులతో పాటు తుపాను బాధితులందరికీ న్యాయం జరిగేలా నష్టపరిహారం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు 25 కేజీల బియ్యం, మత్స్యకారులు, చేనేతలకు 50 కేజీల బియ్యంతోపాటు పప్పు, వంటనూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పంచదార తదితర నిత్యావసర సరుకులను ప్రతి బాధిత కుటుంబానికి అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంపిణీ చేసే సరుకుల్లో కొరత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు.

సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బందికి అభినందనలు : విపత్తు సమయంలో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరంతరం కృషి చేసిన పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖల సిబ్బందిని ఉప ముఖ్యమంత్రి అభినందించారు. సహాయక, రక్షణ చర్యల్లో పాల్గొన్న 45 ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల తక్షణ పునరుద్ధరణకు కృషి చేస్తున్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది సేవలను ప్రశంసించారు. విపత్కర పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేసి ప్రజలకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.

ఈ సమావేశంలో కాకినాడ రూరల్ శాసన సభ్యుడు పంతం నానాజీ, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ఈఎన్‌సీలు తదితరులు పాల్గొన్నారు.

మనమిత్ర...ఇది జనమిత్ర

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : అర్నబ్ తుపాన్ వేళ మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ బాధితులకు కొండంత భరోసాగా నిలిచి సేవలందించింది. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో బాధితులు తమ ప్రాంతంలో ఎదురవుతున్న సమస్యలను మనమిత్ర ద్వారా ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకొచ్చే సదుపాయం కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, ఆర్టీజీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) అధికారులు మనమిత్ర ద్వారా తుపాన్ బాధిత ప్రాంతాల్లో ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే సదుపాయాన్ని వెంటనే అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సేవలను ఉపయోగించుకోవాలని ప్రజలకు దానిపై విస్తృత అవగాహన కల్పించారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు విపత్తు వేళ మనమిత్ర సేవలను సద్వినియోగం చేసుకుని ఉపశమనం పొందారు. తమ ప్రాంతాల్లో నీళ్లు నిలిచిపోయాయని, చెట్లు కూలాయని, కరెంటు పునరుద్ధరించాలని, ఆహారం అందజేయాలని, మెడిసిన్స్ కావాలని, ఇతరత్రా పలు రకాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి అత్యవసర సాయం పొందారు.

95 శాతానికి పైగా పరిష్కారం : మనమిత్ర ద్వారా తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు శుక్రవారం సాయంత్రానికి 1500లకుపైగా సమస్యలను మనమిత్ర ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. మనమిత్ర ద్వారా వచ్చిన సమస్యలను 95 శాతంపైగా అధికారులు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించారు. మనమిత్ర ద్వారా తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు షేర్ చేసిన ప్రతి సమస్యను ఆర్టీజీ కార్యదర్శి భాస్కర్ కాటంనేని, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్‌లు స్వయంగా పర్యవేక్షించారు. వచ్చిన ప్రతి సమస్య నేరుగా ఆయా ప్రాంతాల్లోని స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాలకు చేరవేసి, ఆ సమస్య పరిష్కారం చేయాల్సిన అధికారులకు వెంటనే దాన్ని పంపి, వచ్చిన సమస్య వెంటనే పరిష్కరించేలా పర్యవేక్షించారు.



గోదావరి జిల్లాల నుంచే ఎక్కువ : అర్నబ్ తుపాన్ తీవ్రత ఎక్కువగా ఉన్న గోదావరి జిల్లాల్లో ప్రజలు తుపాన్ వేళ మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ పెద్ద ఎత్తున ఉపయోగించుకున్నారు. కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అత్యధికంగా ప్రజలు తమ ప్రాంతాల్ల తుపాన్ కారణంగా ఎదురైన సమస్యలను మనమిత్ర ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లా నుంచి కూడా ఎక్కువగానే సమస్యలు వచ్చాయి. విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వందల సంఖ్యలో సమస్యలను ప్రజలు షేర్ చేసుకున్నారు.

వాట్సాప్ డీపీ స్టేటస్‌గానూ మనమిత్ర : అర్నబ్ తుపాన్ సమయంలో ఆయా ప్రాంతాల్లో ప్రజలు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నెంబరును తమ వాట్సాప్ డీపీ స్టేటస్ గా కూడా ప్రదర్శించారు. పలు వాట్సాప్ గ్రూపులు సైతం తమ డీపీ స్టేటస్‌గా మనమిత్రను పెట్టారు. ఫలితంగా విపత్తుల వేళ మనమిత్ర బాధితులందరికి చేరగలిగింది. తద్వారా మనమిత్ర 9552300009 నెంబర్ తుపాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజల హౌస్‌హోల్డు నేమ్‌గా మారింది. తుపాన్ విపత్తుల వేళ మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ బాధితుల పక్షాన కీలకంగా పనిచేయడం పట్ల ప్రభుత్వ వర్గాలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి

కాల్ సెంటర్లకు స్పందన : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లు కూడా అర్నబ్ తుపాన్ తీవ్ర సమయంలో ప్రజలకు ఎంతో ఉపకరించాయి. కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 1800 425 0101 కు తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు పెద్ద ఎత్తున ఫోన్లు చేసి అత్యవస సహాయం కోరారు. ఆ సమస్యలను కూడా అధికారులు తక్షణం పరిష్కరించారు. ఈ నెంబర్లకు 741 కాల్స్ వచ్చాయి.

పురపోరుకు భారీ భద్రత

(మొదటి పేజీ తరువాయి)

తనిఖీల్లో భారీగా పట్టివేత : ఎన్నికల సందర్భంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 4,91,700 నగదును స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. 12 లక్షల విలువైన 4,463 లీటర్ల మద్యం, రూ. 39 వేల విలువైన 114 లీటర్ల నాటుసారా, రూ. 2.90 కోట్ల విలువైన 496 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు శాఖ వెల్లడించింది.

92 పట్టణ స్థానిక సంస్థల్లో పోలింగ్ : నవంబరు 1న జరగనున్న పురపోరుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. ఎన్నికల సన్నద్ధతపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థల్లో 8 చోట్ల ఎన్నికలు పూర్తిస్థాయిలో ఏకగ్రీవం కావడంతో మిగిలిన 92 స్థానాల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన సిబ్బంది, ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు.

అవసరమైతే 2న పోలింగ్ : నవంబరు 1న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని మల్లికార్జున వివరించారు. తుపాను, వర్షాల ప్రభావం ఉండే ప్రాంతాల్లో ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లు సమర్పించే నివేదికలను పరిశీలించి, అవసరమైతే ప్రభావిత ప్రాంతాల్లో నవంబరు 2న పోలింగ్ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. నవంబరు 3న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

పురపోరుకు ప్రచార తెర

(మొదటి పేజీ తరువాయి)

కమలాపురం, రాయచోటి తదితర ప్రాంతాల్లో ఛైర్‌పర్సన్ పదవితో పాటు అన్ని వార్డులూ ఏకగ్రీవమయ్యాయి.

36 వేల మందితో బందోబస్తు : నవంబరు 1న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 36,351 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తుకు మోహరించనున్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. డ్రోన్లు, సీసీ కెమెరాలు, వీడియో నిఘాతో పాటు వెబ్‌కాస్టింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ప్రచారం ముగియడంతో అభ్యర్థులు చివరి విడత ఓటర్లను కలిసే పనిలో నిమగ్నమయ్యారు. పోలింగ్ రోజున ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నవంబరు 3న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి. దీంతో పట్టణాల్లో ఎన్నికల సమరం తుది అంకానికి చేరింది.

43వ డివిజన్‌లో గాయత్రి భారీ ర్యాలీ

○ చివరి రోజు ప్రచారంలో కూటమి శ్రేణుల సందడి

గుంటూరు, అక్టోబర్ 30 (జర్నలిస్ట్ ఫైల్): నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారానికి తెరపడుతున్న నేపథ్యంలో 43వ డివిజన్‌లో తెలుగుదేశం, జనసేన బలపరిచిన బీజేపీ అభ్యర్థి రంగావజ్జుల గాయత్రి శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. పొట్టి శ్రీరాములు నగర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ భారత్‌పేట, అమరావతి రోడ్డు, లాడ్జి సెంటర్, బ్రాడీపేట 6వ లైన్, 4వ లైన్ మీదుగా శంకర్ విలాస్ సెంటర్ వరకు కొనసాగింది.

ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ ప్రచారంలో ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని తెలిపారు. డివిజన్‌లో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. ఎన్నికల్లో తనకు అవకాశం కల్పిస్తే 43వ డివిజన్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. డివిజన్‌లో ప్రతి గడపకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందేలా చర్యలు తీసుకుంటానని, వీధి వ్యాపారులకు అండగా నిలుస్తానని తెలిపారు. డివిజన్ సమస్యలను కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులను వినియోగించుకుని డివిజన్‌లో నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. నవంబర్ 1న జరగనున్న ఎన్నికల్లో 43వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా తనకు బ్యాలెట్ నంబర్ 2, కమలం గుర్తుపై, మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు బ్యాలెట్ నంబర్ 1, సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గాయత్రి ఓటర్లను కోరారు. ర్యాలీలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, మద్దిరాల మేని, కుసుకుర్తి హనుమంతరావు, దర్శనపు శ్రీనివాస్, దారా అంబేద్కర్, రామినేని రవీంద్ర, లక్ష్మయ్య, మేళం సైదయ్య, తుర్లపాటి భాస్కర్, పాలపాటి రవికుమార్, ఈదర శ్రీనివాసరెడ్డి, పాటిబండ్ల నారాయణ భరద్వాజ్, వెలగలేటి గంగాధర్, బొల్లాప్రగడ శ్రీదేవి, హరిపావని, భూలక్ష్మి, సుబ్బలక్ష్మి, దేసు సత్యనారాయణ, పోతురాజు వెంకట్, మోతె శేషగిరి, జితేంద్రగుప్త, జంధ్యాల సాయి, బడిశ ఆదినారాయణతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి.. అభివృద్ధికి పట్టం కట్టండి

కేంద్ర మంత్రి పెమ్మసాని, మంత్రి మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి పిలుపు

తెనాలి, అక్టోబర్ 30 (జర్నలిస్ట్ ఫైల్) : తెనాలి మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి శుక్రవారం తెరపడింది. ప్రచార ముగింపు సందర్భంగా కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీ పట్టణంలో రాజకీయ సందడి నింపింది. శివాజీ చౌక్ నుంచి మార్కెట్ వరకు సాగిన ర్యాలీలో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి మనోహర్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రధాన రహదారుల మీదుగా సాగిన ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కూటమి జెండాలు, నినాదాలతో పట్టణంలోని ప్రధాన ప్రాంతాలు సందడిగా మారాయి. ప్రచార చివరి రోజు నిర్వహించిన ఈ ర్యాలీతో ఎన్నికల వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది.

అభివృద్ధికి ప్రాధాన్యత : తెనాలి పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని కూటమి నాయకులు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని కోరారు.

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా పట్టణాల అభివృద్ధిని కూడా వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు లభిస్తే అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

తెనాలి అభివృద్ధికి ప్రజల సహకారం అవసరం : మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెనాలికి ప్రత్యేక చరిత్ర, గుర్తింపు ఉందన్నారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రతి వార్డులో ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కూటమి అభ్యర్థులు పనిచేస్తారని తెలిపారు.

మంత్రి మనోహర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అదే స్ఫూర్తితో మున్సిపాలిటీలో ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చి విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

పట్టణ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు : మున్సిపల్ ఎన్నికలు కేవలం పదవుల కోసం జరిగేవి కావని, పట్టణ భవిష్యత్తును నిర్ణయించే ప్రజాస్వామ్య ప్రక్రియ అని నాయకులు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యతాయుతమైన నాయకత్వానికి అవకాశం కల్పించాలని కోరారు.

ర్యాలీలో కూటమి చైర్‌పర్సన్ అభ్యర్థి తోటకూర వెంకట రమణారావుతో పాటు వివిధ వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార ముగింపు ర్యాలీతో తెనాలి మున్సిపల్ ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసింది. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రధాన అజెండాగా తీసుకుని పట్టణ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కూటమి నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు.

వ్యక్తిగత బంధం బెడిసికొట్టిన తర్వాత అత్యాచారం కేసు పెట్టలేరు

న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) : ప్రేమ లేదా పరస్పర అంగీకారంతో కూడిన వ్యక్తిగత సంబంధాలు విఫలమైన తర్వాత, గతంలో సమ్మతితోనే జరిగిన శారీరక సంబంధాన్ని ఆ తర్వాత అత్యాచారంగా పరిగణించలేమని సుప్రీం కోర్టు శుక్రవారం నాడు కీలక తీర్పును వెలువరించింది. సంబంధాలు బెడిసికొట్టిన తర్వాత వాటిని క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణి పెరుగుతోందని ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. నిజంగా అత్యాచారం, బలవంతం లేదా మోసంతో సమ్మతి పొందిన సందర్భాల్లోనే అత్యాచారం ఆరోపణను పరిశీలించాలని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలు చేస్తూ కేరళకు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన అత్యాచారం, మోసం అభియోగాల నుంచి సుప్రీం కోర్టు విముక్తి కల్పించింది. జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. అత్యాచారం తీవ్రమైన నేరం అని, కానీ ఇలాంటి కేసుల వల్ల నిజంగా లైంగిక వేధింపులు, అత్యాచారానికి గురైన బాధితుల కేసుల తీవ్రత తగ్గిపోతోందని ధర్మాసనం హెచ్చరించింది. గతంలో అంగీకారంతో జరిగిన సంబంధాన్ని, తర్వాత విడిపోయారనే కారణంతో నేరంగా మార్చడం సరికాదని స్పష్టం చేసింది. 'పరస్పర సమ్మతితో సాగిన ఒక బంధం విఫలమైనంత మాత్రాన, ఆ తర్వాత కలిగే పశ్చాత్తాపం లేదా కోపం ఆధారంగా ఆ సంబంధాన్ని నేరంగా పరిగణించలేం. ప్రతి విఫలమైన సంబంధాన్ని నేరంగా చిత్రీకరిస్తే, అసలైన లైంగిక దాడి కేసుల తీవ్రత దెబ్బతింటుంది. నిజమైన లైంగిక హింస, భయపెట్టి లేదా మోసం చేసి అత్యాచారం చేసిన సందర్భాలకు మాత్రమే చట్టాన్ని వర్తింపచేయాలి.' అని జస్టిస్ బివి నాగరత్న పేర్కొన్నారు. విడిపోయిన తర్వాత ఒకరి కోపం కారణంగా మరొకరిని నేరస్థుడిగా చిత్రీకరించలేమని ఆమె స్పష్టం చేశారు. అలాంటి విధానం నిందితుడి వ్యక్తిగత స్వేచ్ఛతో పాటు ప్రతిష్ఠకు కూడా భంగం కలిగిస్తుందని పేర్కొన్నారు. సమ్మతితో కూడిన బంధంలో ఒకసారి భాగస్వామి అయినంత మాత్రాన, తర్వాతి కాలంలో అత్యాచారం ఆరోపణలు వస్తాయనే భయంతో ఆ పురుషుడు ఆ బంధానికే జీవితాంతం కట్టుబడి ఉండాలని భావించడం సమంజసం కాదని సుప్రీం కోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఇలాంటి పరిస్థితుల్లో ఆ బంధం నుంచి బయటకు వచ్చే హక్కు పురుషుడికి ఉండదా?' ఆ నిర్ణయాన్ని మోసంగా ఎలా పరిగణిస్తారు? కచ్చితంగా అది మోసం కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పరస్పర అంగీకారంతో కొనసాగిన ప్రతి సంబంధం విఫలమైనప్పుడు దానిని అత్యాచారం ఆరోపణగా మార్చితే, ఆ నేరం తీవ్రత తగ్గిపోతుందని కూడా పేర్కొంది.

కేసు నేపథ్యం.. : కేరళంకు చెందిన ఓ వ్యక్తి తనపై నమోదైన కేసు నుంచి విముక్తి కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కేరళం హైకోర్టు గతంలో ఆయన డిశ్చార్జ్ పిటిషన్‌ను, క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ఫిర్యాదుదారురాలు గతంలో ఒక వ్యక్తిని వివాహం చేసుకొని విడాకులు తీసుకున్నారు. అనంతరం పిటిషనర్‌తో పరిచయం ఏర్పడింది. అయితే తనకు అప్పటికే వివాహమైందనే విషయాన్ని పిటిషనర్ దాచిపెట్టి తనను మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని ఆమె ఆరోపించారు. ఆపై తప్పుడు పద్ధతిలో లైంగిక సంబంధానికి తన సమ్మతిని పొందాడని బాధితురాలు ఆరోపించినట్లు ప్రాసిక్యూషన్ కోర్టుకు తెలిపింది. నిందితుడు తనపై అత్యాచారం, మోసం, నమ్మక ద్రోహానికి పాల్పడ్డాడని ఆమె ఆరోపించినట్లు తెలిపింది. కర్ణాటకలోని మైసూరులో తామిద్దరం వివాహం చేసుకున్నామని, ఆ తర్వాత 1996 నుంచి 2003 వరకు కలిసి కాపురం చేశామని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వుల్ని రద్దు చేస్తూ నిందితుడికి కేసు నుంచి పూర్తిగా విముక్తి కల్పించింది.

రిటైర్డ్ ఐపిఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యం కన్నుమూత

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రిటైర్డు ఐపిఎస్ అధికారి, ఎపిఎస్‌ఆర్‌టిసి మాజీ ఛైర్మన్ ఎన్ బాలసుబ్రహ్మణ్యం కన్నుమూశారు. గత కొన్నేళ్లుగా కేన్సర్‌తో బాధపడుతున్న ఆయన అమెరికాలోని న్యూయార్క్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన, అమెరికాలోని న్యూయార్క్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 1994 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన బాలసుబ్రహ్మణ్యం కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్‌గా, ఇంటెలిజెన్స్ ఐజిగా, ఇ-ప్రగతి అథారిటీ సిఇఓగా, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టిజిఎస్) సిఇఓగా సేవలందించారు. ఈ ఏడాది ఆగస్టు 30న ఆయన ఎపిఎస్‌ఆర్‌టిసి వైస్ ఛైర్మన్, ఎమ్‌డిగా తన సర్వీసు నుంచి పదవీ విరమణ చేశారు. బాలసుబ్రహ్మణ్యం భౌతికకాయాన్ని మరో మూడు రోజుల్లో అమెరికా నుంచి హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంది.

రిటైర్డు ఐపిఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యం మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. నిజాయతీ విషయంలో రాజీపడకుండా ధృడమైన నిర్ణయాలు తీసుకున్నారని ట్వీట్ చేశారు. పోలీస్‌శాఖలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని, ప్రజాసేవ పట్ల అచంచలమైన నిబద్ధతతో విధులు నిర్వహించారని వెల్లడించారు. ఆయన మరణం పోలీస్ శాఖకు, రాష్ట్రానికి తీరని లోటు అని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా బాలసుబ్రహ్మణ్యం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. బాలసుబ్రహ్మణ్యం మృతి బాధాకరమని, ఆయన సేవలు స్ఫూర్తిదాయకమని తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారు. బాలసుబ్రహ్మణ్యం మృతి పట్ల వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఐపిఎస్ అధికారిగా సుదీర్ఘకాలం పోలీసు శాఖలో సేవలందించిన బాలసుబ్రహ్మణ్యం మరణం విచారకరమని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాలసుబ్రహ్మణ్యం మృతి పట్ల డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఎపిఎస్‌ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంకితభావం, వృత్తిపరమైన నిబద్ధత, సమర్థవంతమైన నాయకత్వంతో పోలీస్ శాఖలో చెరగని ముద్ర వేశారని డిజిపి పేర్కొన్నారు. ఆర్‌టిసి అభివృద్ధికి, సంస్థ పరిపాలనను బలోపేతం చేయడానికి బాలసుబ్రహ్మణ్యం అందించిన సేవలు చిరస్మరణీయమని ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. విజయవాడ ఆర్‌టిసి హౌస్‌లో నిర్వహించిన బాలసుబ్రహ్మణ్యం సంతాప కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ఎపిఎస్‌ఆర్‌టిసి ఉన్నతాధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌ఆర్‌టిసి వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కోన శశిధర్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. బాలసుబ్రహ్మణ్యం మృతి పట్ల తెలంగాణ మాజీ డిజిపి, రిటైర్డు ఐపిఎస్ అధికారి అంజనీ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కశ్మీర్‌లో ఉగ్రవాద ఫైనాన్స్ నెట్‌వర్క్ గుట్టు రట్టు..

శ్రీనగర్ (జర్నలిస్ట్ ఫైల్) : జమ్మూకశ్మీర్ పోలీసులు శుక్రవారం ఓ భారీ ఉగ్రవాద ఆర్థిక నెట్‌వర్క్‌ను ఛేదించారు. ఉగ్ర కార్యకలాపాల కోసం నిధులు సేకరిస్తూ, వాటిని టెర్రరిస్టులకు చేరవేస్తున్నారన్న అభియోగాలతో 10 మంది నిందితులను అరెస్టు చేశారు. షోపియాన్ పోలీస్ స్టేషన్‌లో దీనిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు.

"వివిధ ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌ల్లో జరిగిన అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలను గుర్తించాం. దీనితో ఆ ఉగ్రవాదుల ఫైనాన్సింగ్ నెట్‌వర్క్ గుట్టురట్టు అయ్యింది. ఉగ్రకార్యకాలాపాల కోసం సేకరించిన డబ్బు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తుందోనే కోణంలో మేము దర్యాప్తు చేశాం. ఈ దర్యాప్తులో వేర్వేరు జైళ్లలో ఉన్న ఉగ్రవాదులతో, వారి అనుచరులతో ఈ నిందితులకు సంబంధాలు ఉన్నట్లు తేలింది. అరెస్టు అయిన వారిలో షోపియాన్‌కు చెందిన ఒవైస్ షఫీ నైకూ (సైద్‌పోరా బాలా), తజాముల్ అహ్మద్ షా (రావల్‌పోరా), మోయిజ్ ఇక్బాల్, ఇమ్దాద్ యూసుఫ్ గని (చిత్రగామ్ కలాన్), పుల్వామాకు చెందిన సాకిబ్ జహూల్ వాని, అమీరర్ అహ్మద్ గని, లియాఖత్ నజీర్ లోన్, ట్రెంచ్ నాడిగుండ్‌కు చెందిన ఫిరదౌస్ తోకర్, కథువా చెక్ హరియాకు చెందిన మహ్మద్ హనీఫ్, కాజు ఉన్నారు. వీరు సామాన్య ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి, నిషేధిత ఉగ్రవాద సంస్థలైన లష్కరే తోయిబా (ఎల్‌ఇటి), దాని

అనుబంధ సంస్థ "ది రెసిస్టెన్స్ ఫ్రంట్" (టిఆర్‌ఎఫ్) కార్యకలాపాల కోసం అందిస్తున్నారు. ఇందుకోసం వారు రహస్యంగా ఆన్‌లైన్ పేమెంట్ యాప్‌లను వాడుతున్నట్లు మా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ నిధులను ఉగ్రవాదులకు అవసరమైన వసతులు కల్పించడానికి, ముఖ్యంగా నెట్‌వర్క్‌లో ఉన్నవారికి స్మార్ట్‌ఫోన్‌లు కొనుగోలు చేయడానికి ఉపయోగించినట్లు తేలింది. ఈ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న ఇతరులను గుర్తించడానికి, మిగిలిన టెర్రర్ ఫైనాన్సింగ్ లింక్‌లను కనిపెట్టడానికి, ఈ నెట్వర్క్ ఎంత విస్తృతంగా వ్యాపించి ఉందో గుర్తించడానికి దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. విచారణ ముందుకు సాగే కొద్దీ మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉంది" అని పోలీసులు తెలిపారు. ఇంతకు ముందు, ఈ ఆగస్టులో శ్రీనగర్ కేంద్రంగా పనిచేస్తున్న అంతర్రాష్ట్ర లష్కరే తోయిబా ఉగ్ర ముఠాను జమ్మూ కశ్మీర్ పోలీసులు ఛేదించారు. ఈ ఆపరేషన్‌లో ఇద్దరు మోస్ట్ వాంటెడ్ పాకిస్థానీ ఉగ్రవాదులతో పాటు శ్రీనగర్‌కు చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో 16 ఏళ్లుగా పరారీలో ఉన్న పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాది అబ్దుల్లా అలియాస్ అబు హురైరా కూడా ఉన్నాడని అధికారులు తెలిపారు. అతడు జమ్మూకశ్మీర్ వెలుపలకు లష్కరే తోయిబాను విస్తరించడానికి ప్రయత్నించాడని తెలిపారు. పాక్‌కు చెందిన మరో ఉగ్రవాది ఉస్మాన్ అలియాస్ కుబైబ్‌ను ఆగస్టు నెల 6న అదుపులోకి తీసుకున్నామని పోలీసులు చెప్పారు.

మిథున్‌రెడ్డికి ఎదురుదెబ్బ

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా అన్నమయ్య జిల్లా పుంగనూరులో జరిగిన దాడుల కేసుల్లో నిందితుడిగా ఉన్న వైసిపి ఎంపి మిథున్‌రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన నాలుగు కేసులను కొట్టివేయాలని, అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. కేసులకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులను, ఫిర్యాదుదారులను ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబరు 28కి వాయిదా వేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నామినేషన్లు వేసేందుకు వెళుతున్న టిడిపి శ్రేణులపై దాడులు చేయడం, కార్యకర్తలపైకి ప్రైవేటు బౌన్సర్ కారును నడిపించడం, హత్యాయత్నానికి పాల్పడటం వంటి ఘటనలకు పాల్పడ్డారంటూ వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ నెల 16న పుంగనూరు పట్టణ పోలీసులు.. ఎంపి మిథున్‌రెడ్డి, ఆయన అనుచరులపై నాలుగు కేసులు నమోదు చేశారు. ఒకే ఘటనకు సంబంధించి నాలుగు కేసులు నమోదు చేయడం సరికాదని, రాజకీయ ప్రతీకారంతోనే కేసులు పెట్టారని మిథున్‌రెడ్డి తరపున న్యాయవాది వాదించారు. అయితే, నాలుగు వేర్వేరు నేర ఘటనలు జరిగాయని, బాధితులు, ఘటనల సమయాలు వేర్వేరని పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. వాహనాల్లో కర్రలు, రాడ్లు తీసుకొచ్చి దాడులకు పాల్పడటంతో 30 మంది గాయపడ్డారని, ప్రైవేటు బౌన్సర్ కారును ప్రజలపైకి ఉద్దేశపూర్వకంగా నడిపి హత్యాయత్నానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై లక్ష్మణరావు.. పిటిషనర్‌కు పోలీసుల అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు నిరాకరించారు.

ఉత్తరాఖండ్‌లో కూలిన హెలికాప్టర్..

డెహ్రాడూన్ (జర్నలిస్ట్ ఫైల్) : ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ సమీపంలో ఒక ప్రైవేట్ హెలికాప్టర్ కూలిపోయింది. బద్రీనాథ్ నుంచి దేహ్రాదూన్ వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆరుగురు చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఉత్తరాఖండ్లోని ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్లే ఈ ఘటన జరిగి ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. ఉత్తరాఖండ్ విపత్తు నిర్వహణ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2:20 గంటల సమయంలో చమోలి జిల్లా జోషీమఠ్ పరిధిలోని 'చాయ్' గ్రామ సమీపంలోకి రాగానే హెలికాప్టర్ కమ్యూనికేషన్‌ను కోల్పోయింది. అనంతరం ట్రాకింగ్ సిస్టమ్కు సమాచారం రావడం ఆగిపోయింది. జేపీ పవర్ హౌస్ సమీపంలో ఉన్న ఒక కొండను బలంగా ఢీకొట్టి ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. అనే ప్రయివేట్ సంస్థకు చెందినదిగా జిల్లా యంత్రాంగం గుర్తించింది.

భూటాన్‌లో హిమానీనద సరస్సు విస్ఫోటం - భారత్ లోని ఈశాన్య రాష్ట్రాలకు హై అలర్ట్

భూటాన్ : పొరుగుదేశమైన భూటాన్‌లో చోటుచేసుకున్న భారీ వరద ప్రమాదం భారత ఈశాన్య రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఇటీవల నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదల ఘటన మరువకముందే.. వాయవ్య భూటాన్‌లోని గాసా జిల్లాలో ఉన్న షింటాఫు సరస్సు ఒక్కసారిగా విస్ఫోటం చెందింది. దీంతో సరస్సులోని సుమారు 7.4 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఒక్కసారిగా బయటకు ప్రవహించి, మోచు నదిలో వరద ఉధృతి పెరిగింది.

వరదలో కొట్టుకుపోయిన వేడినీటి బుగ్గ సౌకర్యాలు .... : గాసా జిల్లాలో మోచు నది పరీవాహక ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ వేడినీటి బుగ్గ 'గాసాత్చాచు' వద్ద భారీ నష్టం సంభవించింది. వరద ప్రవాహానికి అక్కడ ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలు, నీటి ప్రవాహ మార్గాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అయితే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించిన భూటాన్

అధికారులు అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో ప్రాణనష్టం తప్పింది.

భారత సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తత .... : భూటాన్‌లో పరిస్థితి తీవ్రతను గుర్తించిన అధికారులు దిగువ ప్రాంతాల్లో ఉన్న భారత ప్రభుత్వానికి ముందస్తు సమాచారం అందించారు. వరద నీరు శ్రీగాంగ్ ప్రాంతాన్ని దాటి భారత సరిహద్దుల వైపు వేగంగా కదులుతుండటంతో పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల్లోని పలు జిల్లాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హెచ్చరికలు జారీ చేశాయి.

పశ్చిమ బెంగాల్‌లో .... సంకోష్, మోచు నదుల పరీవాహక ప్రాంతాలతో పాటు డార్జిలింగ్ కొండ ప్రాంతాలు, అలీపుర్‌దువార్, జల్‌పాయిగురి, కూచ్‌బెహార్ జిల్లాల అధికారులు అప్రమత్తమయ్యారు. స్థానిక ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. అస్సాంలో .... ధుబ్రి జిల్లాతో పాటు నదీ దిగువ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచించారు.

ప్రమాదకర హిమానీనద సరస్సుల్లో ఒకటి .... : హిమాలయ ప్రాంతంలో అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించిన 17 హిమానీనద సరస్సుల్లో షింటాఫు సరస్సు కూడా ఒకటి. ఈ సరస్సు మోచు నదికి ప్రధాన నీటి వనరుగా ఉంది. గతంలో 2021లోనూ మోచు నది ప్రవాహ మార్గం మారడంతో గాసాత్చాచు వేడినీటి బుగ్గ వద్ద నిర్మించిన సదుపాయాలు దెబ్బతిన్నాయి. తాజా ఘటన నేపథ్యంలో భారత్‌లోని పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాల విపత్తు నిర్వహణ బృందాలు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. వరద ప్రభావం దిగువ ప్రాంతాలపై పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాయి.

పంట చేతికొచ్చే వేళ ప్రకృతి విరుచుకుపడింది..

నష్టపోయిన ప్రతి రైతుకూ అండగా నిలవాలి

జర్నలిస్ట్ ఫైల్
JOURNALIST FILE
సంపాదక స్వరం
EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం

ఆర్నబ్ దెబ్బకు అన్నదాత విలవిల...

భరోసా కల్పించడమే అసలు పరీక్ష

ఒకవైపు ఎల్‌నినో హెచ్చరికలు.. మరోవైపు వాతావరణ మార్పుల అనిశ్చితి.. పెరుగుతున్న సాగు ఖర్చులు.. గిట్టుబాటు ధరపై ఆందోళన.. వీటన్నింటినీ అధిగమించి పంటను కాపాడుకుని ఇంటికి చేర్చుకోవాలని ఆశించిన అన్నదాతకు ఆర్నబ్ తుపాను మరో పిడుగులాంటి దెబ్బ తగిలించింది.లిలి నెలల తరబడి శ్రమించి, పెట్టుబడి పెట్టి, అప్పులు చేసి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి విరుచుకుపడటంతో రైతు ఆశలు నీటమునిగాయి. ఇది కేవలం పంట నష్టం కాదు.. ఒక కుటుంబం ఏడాది ఆదాయానికి, భవిష్యత్ ప్రణాళికలకు, అప్పుల చెల్లింపుల ఆశలకు తగిలిన దెబ్బ.

ఆర్నబ్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరి పొలాలు నీట మునిగాయి. కోతకు సిద్ధమైన పంట దెబ్బతినడంతో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ధాన్యం తడిసి మొలకెత్తడం, చేను కుళ్లిపోవడం వంటి సమస్యలు రైతులను వెంటాడుతున్నాయి. అరటి, కొబ్బరి, కూరగాయలు, బొప్పాయి, పసుపు, పూలు, తమలపాకు వంటి ఉద్యాన పంటలకూ భారీ నష్టం వాటిల్లింది. ప్రాథమిక అంచనాల ప్రకారం 14 జిల్లాల్లో 2.24 లక్షల హెక్టార్లకు పైగా పంటలు దెబ్బతినగా, సుమారు 3.45 లక్షల మంది రైతులు ప్రభావితమైనట్లు సమాచారం. క్షేత్రస్థాయి సర్వే పూర్తయ్యేలోపు ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది.

రైతుకు నష్టం అంటే.. ఆదాయానికే నష్టం : ప్రకృతి విపత్తు వచ్చినప్పుడు రహదారులు దెబ్బతినడం, విద్యుత్ స్తంభాలు పడిపోవడం, ఇళ్లు ధ్వంసం కావడం వంటి నష్టాలు కంటికి కనిపిస్తాయి. కానీ పొలంలో పంట నష్టాన్ని మాత్రం అంకెల్లో మాత్రమే కొలవలేం. ఒక ఎకరం పంట వెనుక విత్తనం, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చు, నీటి వ్యయం, యంత్రాల అద్దె, రైతు శ్రమ ఉంటాయి. వీటన్నింటినీ వెచ్చించిన తర్వాత పంట చేతికందకపోతే.. రైతు కోల్పోయేది కేవలం దిగుబడి కాదు, పెట్టిన పెట్టుబడి మొత్తం.

ఇప్పటికే సాగు వ్యయాలు పెరిగాయి. మార్కెట్‌లో ధరలపై అనిశ్చితి కొనసాగుతోంది. వ్యవసాయ ఆదాయం అనేక కుటుంబాలకు స్థిరంగా ఉండటం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రకృతి విపత్తు ఒక రైతు కుటుంబాన్ని ఒక్కసారిగా ఆర్థికంగా వెనక్కి నెట్టేస్తుంది. అందుకే పంట నష్టాన్ని సాధారణ నష్టంగా కాకుండా లిలిగ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పడే తీవ్ర ప్రభావంగాలిలి ప్రభుత్వం చూడాలి.

సర్వేలో ఒక్క రైతూ మిగలకూడదు : ఇప్పుడు అత్యంత కీలకమైన పని నష్టం అంచనా. కాగితాలపై జరిగే సర్వే కాకుండా.. ప్రతి గ్రామంలో, ప్రతి పొలంలో వాస్తవ పరిస్థితిని గుర్తించే సమగ్ర సర్వే అవసరం. పొలంలో ఎంత విస్తీర్ణం దెబ్బతింది? ఏ పంట నష్టపోయింది? ఎంత దిగుబడి కోల్పోయారు? రైతు పెట్టుబడి ఎంత? పంట కోత దశలో ఉందా? వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

గతంలో కొన్ని విపత్తుల సమయంలో అర్హులైన రైతుల పేర్లు జాబితాల్లో లేకపోవడం, పంట వర్గీకరణలో తప్పులు జరగడం, పరిహారం విషయంలో వ్యత్యాసాలు తలెత్తడం వంటి సమస్యలు వెలుగులోకి వచ్చాయి. అందువల్ల ఈసారి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గ్రామాల వారీగా నష్టం వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలి. రైతులకు తమ వివరాలను పరిశీలించుకునే అవకాశం ఇవ్వాలి. నష్టాన్ని తక్కువగా నమోదు చేశారని భావించే రైతులకు ఫిర్యాదు చేసేందుకు సులభమైన వ్యవస్థ ఉండాలి.

కౌలు రైతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ : ఈ సందర్భంలో కౌలు రైతుల సమస్యను విస్మరించకూడదు. భూమి యాజమాన్య హక్కు వారి పేరుపై లేకపోయినా.. వాస్తవంగా పొలంలో పెట్టుబడి పెట్టి సాగు చేసేది వారే. పంట నష్టపోతే ఆర్థిక భారాన్ని భరించేది కూడా వారే.

అందువల్ల లిలిభూమి ఎవరి పేరుపై ఉందన్నదే కాకుండా.. వాస్తవంగా ఎవరు సాగు చేశారన్నది కూడా పరిహారం నిర్ణయంలో కీలక ప్రమాణంగా ఉండాలి.లిలి సరైన రికార్డులు, గ్రామస్థాయి ధ్రువీకరణ, స్థానిక వ్యవసాయ అధికారుల పరిశీలన ఆధారంగా అర్హులైన కౌలు రైతులను గుర్తించి సాయం అందించాలి. లేకపోతే ప్రకృతి విపత్తు తర్వాత కూడా అత్యంత బలహీన వర్గమే నష్టపోతుంది.

పరిహారం.. ఆలస్యం కాకూడదు : నష్టం జరిగిన తర్వాత పరిహారం అందడానికి నెలలు పడితే దాని ప్రయోజనం తగ్గిపోతుంది. రైతుకు ఇప్పుడు కావాల్సింది ప్రకటనలు కాదు.. తక్షణ ఆర్థిక సహాయం. పంట నష్టపరిహారంతో పాటు కుటుంబ అవసరాలు, అప్పుల ఒత్తిడి, తదుపరి పంటకు కావాల్సిన పెట్టుబడి వంటి అంశాలను కూడా దృష్టిలో పెట్టుకుని పునరావాస చర్యలు చేపట్టాలి.

మృతుల కుటుంబాలకు తక్షణ సహాయం, ఇళ్లు దెబ్బతిన్న వారికి పునర్నిర్మాణ సాయం, జీవనోపాధి కోల్పోయిన కుటుంబాలకు ప్రత్యేక మద్దతు అవసరం. వ్యవసాయ కూలీలు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, చిరు వ్యాపారులు వంటి వ్యవసాయేతర జీవనోపాధులు కోల్పోయిన వర్గాలనూ సహాయ పరిధిలోకి తీసుకురావాలి. వరద ప్రభావిత ప్రాంతాల్లో నిత్యావసర సరుకుల సరఫరా నిరంతరంగా కొనసాగాలి.

కేంద్రం, రాష్ట్రం కలిసి ముందుకు రావాలి : విపత్తు తీవ్రత రాష్ట్ర వనరులతో మాత్రమే ఎదుర్కోలేని స్థాయిలో ఉంటే కేంద్రం నుంచి తగిన ఆర్థిక సహాయం వేగంగా అందాలి. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర నష్టం అంచనాలతో కేంద్రాన్ని కోరడంతో పాటు.. బాధితులకు నిధులు త్వరగా చేరేలా నిరంతరం అనుసరించాలి. విపత్తు సహాయం విషయంలో రాజకీయ భేదాలకు, ప్రాంతీయ లేదా పార్టీ అనుబంధాలకు ఎలాంటి స్థానం ఉండకూడదు.

ప్రకృతి వైపరీత్యం ప్రజలను పార్టీలు, వర్గాలుగా విడదీయదు. అందువల్ల సహాయక చర్యలు కూడా ఎలాంటి వివక్ష లేకుండా సాగాలి. లిలివిపత్తు సమయంలో ప్రభుత్వ పనితీరుకు నిజమైన కొలమానం.. ఎంతమంది బాధితులకు ఎంత త్వరగా, ఎంత పారదర్శకంగా సహాయం చేరిందన్నదే.లిలి

తుపాను వచ్చినప్పుడే కాదు.. ముందే సిద్ధం కావాలి : వాతావరణ మార్పుల ప్రభావంతో తీవ్రమైన వర్షాలు, తుపానులు, వరదలు వంటి విపత్తుల స్వభావం మారుతోంది. ముందస్తు హెచ్చరికలు, ప్రజల తరలింపు, రక్షిత ప్రాంతాల ఏర్పాటు వంటి చర్యల్లో గతంతో పోలిస్తే మెరుగుదల కనిపిస్తోంది. ఈ కారణంగా ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని కొంతవరకు తగ్గించగలుగుతున్నాం. కానీ లిలిపంట నష్టాన్ని తగ్గించడంలో ఇంకా పెద్ద లోటు ఉంది.

ఇకపై విపత్తు నిర్వహణ అంటే కేవలం తుపాను సమయంలో సహాయక చర్యలు చేపట్టడం కాకూడదు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నీటిని వేగంగా బయటకు పంపే కాలువలు, డ్రైనేజీ వ్యవస్థలు, పంట రక్షణ పద్ధతులు, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు, పంట బీమా వ్యవస్థను మరింత సమర్థంగా అమలు చేయడం వంటి దీర్ఘకాలిక చర్యలు అవసరం.

అన్నదాతకు భరోసా కల్పించడమే అసలు పరీక్ష : ఆర్నబ్ తుపాను ప్రకృతి శక్తి ఎంతటి నష్టాన్ని కలిగించగలదో మరోసారి చాటిచెప్పింది. అయితే ప్రకృతి విపత్తును పూర్తిగా అడ్డుకోలేకపోయినా.. దాని తర్వాత రైతు కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక పతనాన్ని మాత్రం విధానపరమైన చర్యలతో తగ్గించవచ్చు.

ఇప్పుడు రైతుకు కావాల్సింది సానుభూతి మాటలు కాదు.. లిలినష్టం సరిగ్గా గుర్తింపు, న్యాయమైన పరిహారం, వేగవంతమైన చెల్లింపు, తదుపరి పంటకు పెట్టుబడి, మార్కెట్ భరోసా.లిలి ఈ ఐదు అంశాలు సమర్థంగా అమలైతేనే రైతు మళ్లీ పొలంలోకి ధైర్యంగా అడుగుపెట్టగలడు.

తుపాను తగ్గిపోయింది. వర్షాలు ఆగిపోతాయి. పొలాల్లో నీరు కూడా క్రమంగా తగ్గుతుంది. కానీ రైతు కుటుంబంపై పడిన ఆర్థిక భారాన్ని తగ్గించడానికి ఇంకా ఎంతో చేయాల్సి ఉంది.

ప్రకృతి విపత్తు రైతు తప్పు కాదు. పంట నష్టపోయినందుకు రైతే శిక్ష అనుభవించాల్సిన పరిస్థితి కూడా ఉండకూడదు. ఆర్నబ్ తుపాను తర్వాత ప్రభుత్వాల ముందున్న అసలు పరీక్ష ఇదే–పంటను కోల్పోయిన అన్నదాత తన భవిష్యత్తును మాత్రం కోల్పోకుండా చూడటం.

కొఠియాలో ఓటుకు

అడ్డంకులెందుకు?

సరిహద్దు వివాదం పేరుతో గిరిజనుల ఓటు హక్కుకు అడ్డంకులు ఉండకూడదు



ఆంధ్రప్రదేశ్–ఒడిశా సరిహద్దులోని కొఠియా గ్రామాల పేరు వినగానే సరిహద్దు వివాదం గుర్తుకొస్తుంది. ఏళ్లుగా కొనసాగుతున్న ఈ వివాదం పరిపాలనా పరిధులకే పరిమితం కాకుండా అక్కడి గిరిజనుల దైనందిన జీవనాన్ని కూడా ప్రభావితం చేస్తోంది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మరోసారి కొఠియా ప్రాంతం రాజకీయ, పరిపాలనా ఉద్రిక్తతలకు కేంద్రంగా మారడం ఆందోళన కలిగించే పరిణామం.

పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండల పరిధిలోని కొఠియా గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. 21 గ్రామాలకు సంబంధించి ఐదు ఎంపీటీసీ స్థానాలకు ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తం 2,883 మంది ఓటర్లు ఉండగా, 20 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు సమాచారం. అంటే ఈ ప్రాంత ప్రజలు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే వారి ముందున్న అతిపెద్ద ప్రశ్న ఒక్కటే–ఎలాంటి ఒత్తిడి లేకుండా, భయరహిత వాతావరణంలో ఓటు వేయగలరా?

కొఠియా వివాదం కొత్తది కాదు. దశాబ్దాలుగా ఇరు రాష్ట్రాలు ఈ ప్రాంతంపై తమ పరిపాలనా హక్కులను వాదిస్తున్నాయి. అయితే ఈ వివాదానికి పరిష్కారం కనుగొనాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. ప్రజల ఓటు హక్కును అడ్డుకోవడం ద్వారా ఏ రాష్ట్రానికీ ప్రయోజనం ఉండదు. ప్రజాస్వామ్య ప్రక్రియను వివాదానికి వేదికగా మార్చడం వల్ల నష్టపోయేది అక్కడి సామాన్య గిరిజనులే.

గతంలో ఎన్నికల సమయంలో సరిహద్దులను మూసివేయడం, భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పుడు కూడా ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య ఉద్రిక్తతలు తలెత్తుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఒడిశా అధికారులు అడ్డుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ భవనాలు, నీటి వసతుల నిర్మాణం, తెలుగు విద్యా సామగ్రి వంటి అంశాలపై వివాదాలు తలెత్తడం పరిస్థితి ఎంత సున్నితంగా ఉందో తెలియజేస్తోంది.

ఇటీవల కొఠియా పరిధిలో ఏపీ అధికారుల బృందం పర్యటించిన సమయంలో ఒడిశాకు చెందిన ప్రజాప్రతినిధులు, స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనట్లు సమాచారం. అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడం కూడా సరిహద్దు పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోంది. అయితే ఇలాంటి ఘటనలు మరింత ఉద్రిక్తతకు దారితీయకుండా ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలి. స్థానిక స్థాయిలో పరస్పర ఆరోపణలు, ఘర్షణలు పెరిగితే దాని ప్రభావం చివరకు సామాన్యులపైనే పడుతుంది.

అత్యంత ముఖ్యమైన అంశం గిరిజనుల హక్కులులిలి. కొఠియాలో నివసిస్తున్న ప్రజలు సరిహద్దు వివాదానికి కారకులు కాదు. వారు తరతరాలుగా అక్కడే నివసిస్తూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. వారికి పాఠశాల, వైద్యం, తాగునీరు, రహదారి, విద్యుత్, ఉపాధి వంటి మౌలిక వసతులు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. ఏ ప్రాంతంపై పరిపాలనా హక్కు ఉందనే వివాదం పేరుతో ప్రజలకు సంక్షేమ సేవలు అందకుండా చేయడం సమర్థనీయం కాదు.

అదేవిధంగా ఎన్నికల విషయంలోనూ ఇదే సూత్రం వర్తించాలి. ఒక ఓటరు ఏ రాష్ట్రానికి చెందినవాడనే వివాదం కంటే ముందు అతనికి భయరహితంగా తన ఓటు హక్కును వినియోగించే అవకాశం ఉందా? అన్నదే ప్రజాస్వామ్యానికి అసలు పరీక్ష. పోలింగ్ కేంద్రాల వద్ద తగిన భద్రత కల్పించడం, ఓటర్లపై ఎలాంటి ఒత్తిడి లేకుండా చూడడం, ఇరు రాష్ట్రాల పోలీసు యంత్రాంగం సంయమనంతో వ్యవహరించడం అత్యవసరం.

కొఠియా వంటి సున్నిత ప్రాంతాల్లో ఎన్నికలు నిర్వహించడం సాధారణ ప్రాంతాలతో పోలిస్తే భిన్నమైన సవాలు. అందుకే ముందస్తు సమన్వయ సమావేశాలు, స్పష్టమైన భద్రతా ప్రణాళిక, అధికారుల మధ్య నిరంతర సమాచార మార్పిడి అవసరం. ఏ చిన్న సంఘటన జరిగినా అది రెండు రాష్ట్రాల మధ్య పెద్ద వివాదంగా మారే అవకాశం ఉన్నందున ప్రతి అడుగూ అత్యంత బాధ్యతాయుతంగా ఉండాలి.ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, అధికారుల విధులకు ఆటంకం, ఎన్నికల ప్రక్రియకు అడ్డంకులు వంటి చర్యలు ఎక్కడ జరిగినా చట్టపరంగా ఎదుర్కోవాలి. అదే సమయంలో చట్టాన్ని అమలు చేసే అధికారులు కూడా సంయమనం పాటించాలి. ప్రజలను రెచ్చగొట్టే ప్రకటనలు, రాజకీయ ప్రదర్శనలు, పరస్పర ఆరోపణలు సమస్యను మరింత జఠిలం చేస్తాయి.

ఇది కేవలం ఆంధ్రప్రదేశ్, ఒడిశా మధ్య సరిహద్దు సమస్యగా చూడాల్సిన విషయం కాదు. లిలిభారత రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ఒక సరిహద్దు వివాదం ఎంతవరకు ప్రభావితం చేయగలదు?లిలి అనే ప్రశ్నగా చూడాలి. సరిహద్దులు ప్రభుత్వాల మధ్య చర్చలకు సంబంధించిన అంశం. ఓటు హక్కు మాత్రం ప్రజల రాజ్యాంగ హక్కు.

కొఠియా వివాదానికి శాశ్వత పరిష్కారం రావాలంటే ఇరు రాష్ట్రాలు రాజకీయంగా కాకుండా రాజ్యాంగబద్ధమైన, పరిపాలనా, న్యాయపరమైన మార్గాల్లో ముందుకు సాగాలి. స్థానిక గిరిజనుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. పరస్పర ఘర్షణలతో సమస్య పరిష్కారం కాదు. సంభాషణ, సమన్వయం, చట్టబద్ధమైన చర్యలే మార్గం.

ఇప్పటికైనా ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ఒక విషయం స్పష్టంగా గుర్తించాలి. కొఠియా ప్రజలు ఎవరి రాజకీయ ప్రయోజనాలకు బలికాకూడదు. ఎన్నికలు వస్తాయి, పోతాయి. ప్రభుత్వాలు మారుతాయి. కానీ అక్కడి గిరిజనుల జీవితం, వారి భద్రత, వారి భవిష్యత్తు మాత్రం కొనసాగాలి.

అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో మొదటి ప్రాధాన్యత ఘర్షణకు కాదు–ప్రజాస్వామ్యానికి. రాజకీయ ఆధిపత్యానికి కాదు–ప్రజల హక్కులకు. పరస్పర ఆరోపణలకు కాదు–సమన్వయానికి.

కొఠియాలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడం ఒక్క ప్రాంతానికి సంబంధించిన విజయంగా కాకుండా, ప్రజాస్వామ్య విలువలను సరిహద్దు వివాదాలకంటే పై స్థాయిలో నిలబెట్టిన విజయంగా నిలవాలి. అక్కడి ప్రతి ఓటరు ఎలాంటి భయం లేకుండా పోలింగ్ కేంద్రానికి వెళ్లి తన ఓటును వినియోగించుకునే పరిస్థితిని కల్పించడం ఇరు రాష్ట్రాల ప్రభుత్వాల తక్షణ బాధ్యత.

వీల్‌చైర్‌పై స్ఫూర్తి ప్రయాణం

- **వైకల్యం శరీరానికే.. సంకల్పానికి కాదు**
- **జీవనోపాధితో పాటు రోడ్డు భద్రతకు సందేశమిస్తున్న పురుషోత్తం**

వీల్‌చైర్ అంటే చాలామందికి పరిమితి గుర్తుకు వస్తుంది. కానీ పురుషోత్తం గరాడియాకు మాత్రం అదే వీల్‌చైర్ జీవన ప్రయాణానికి వాహనంగా మారింది. శారీరక వైకల్యం తన అడుగులను ఆపలేదని నిరూపిస్తూ, ఎవరిపైనా ఆధారపడకుండా జీవించాలనే సంకల్పంతో బెంగళూరు రహదారులపై ఫుడ్ డెలివరీ చేస్తున్న 28 ఏళ్ల ఈ యువకుడు ఇప్పుడు స్ఫూర్తికి ప్రతిరూపంగా నిలుస్తున్నాడు.

ఒడిశాలోని రాయగడ జిల్లాకు చెందిన పురుషోత్తం శారీరక వైకల్యం కారణంగా వీల్‌చైర్‌కే పరిమితమయ్యాడు. అయితే పరిస్థితులను నిందిస్తూ కూర్చోవడం అతడి స్వభావం కాదు. జీవనోపాధి కోసం స్వగ్రామాన్ని విడిచి వందల కిలోమీటర్ల దూరంలోని బెంగళూరుకు వచ్చాడు. తొలుత టెలీకాలర్‌గా పనిచేశాడు. అనంతరం ఫుడ్ డెలివరీ రంగంలోకి అడుగుపెట్టాడు. గత నాలుగు నెలలుగా ఎలక్ట్రిక్ వీల్‌చైర్‌పై నగరంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తూ వినియోగదారులకు ఆహారాన్ని చేరవేస్తున్నాడు.

ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తూ తన జీవనాన్ని కొనసాగించడంతో పాటు కుటుంబానికి అండగా నిలుస్తున్నాడు. ఇది కేవలం ఉద్యోగం కాదు. తనపై తాను ఆధారపడగలననే ఆత్మవిశ్వాసానికి ప్రతిరూపం. శారీరక పరిమితి ఉన్నప్పటికీ ఆర్థికంగా కుటుంబానికి తోడుగా నిలవాలనే బాధ్యతను పురుషోత్తం తన భుజాలపై వేసుకున్నాడు.

అయితే అతడి కథలో మరో విశేషం ఉంది. సాధారణ వాహనదారులే హెల్మెట్ ధరించకుండా రోడ్లపై ప్రయాణిస్తున్న సమయంలో, వీల్‌చైర్‌పై ప్రయాణించే పురుషోత్తం మాత్రం తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తున్నాడు. రద్దీగా ఉండే బెంగళూరు రహదారులపై తన భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నాడు.

లిలి“జీవితం అమూల్యమైనది. మనకు ఎంత ఆత్మవిశ్వాసం ఉన్నా రోడ్లపై అప్రమత్తంగా ఉండాలి. స్వగ్రామాల్లో మన కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారు. వారి కోసం మన భద్రతను కూడా కాపాడుకోవాలి. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. నేను వీల్‌చైర్‌పై ప్రయాణించినప్పుడల్లా హెల్మెట్ ధరిస్తాను. ఇతరులు కూడా తమ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి”లిలి అన్న పురుషోత్తం మాటలు ప్రతి ఒక్కరికీ ఆలోచింపజేసేవే.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా ప్రసంగాలు చేయకపోయినా, తన ఆచరణ ద్వారానే సందేశాన్ని ఇస్తున్నాడు. ఒక వ్యక్తి తన ప్రాణాలను ఎంత విలువైనవిగా భావిస్తున్నాడో అతడి జాగ్రత్తలు తెలియజేస్తున్నాయి. రహదారిపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తన భద్రతకు తానే బాధ్యత వహించాల్సిన అవసరాన్ని పురుషోత్తం తన జీవనశైలితో గుర్తుచేస్తున్నాడు.

ఈ ప్రయాణంలో బెంగళూరు ప్రజలు, రెస్టారెంట్ సిబ్బంది, తాను పనిచేసే సంస్థ అందిస్తున్న సహకారాన్ని కూడా అతడు ప్రత్యేకంగా గుర్తుచేసుకుంటున్నాడు. కొత్త నగరంలో పరిచయం లేని వ్యక్తుల నుంచి లభించిన సహాయం తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని చెబుతున్నాడు. శారీరక వైకల్యం ఉన్న వ్యక్తిగా తనను ప్రత్యేకంగా చూడకుండా, ఒక సాధారణ ఉద్యోగిగా గౌరవించడం తనకు మరింత సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొంటున్నాడు.

పురుషోత్తం కథలో మరో ముఖ్యమైన అంశం అతడి భవిష్యత్తు లక్ష్యం. ఫుడ్ డెలివరీ ఉద్యోగంతోనే తన ప్రయాణాన్ని ముగించాలని అతడు భావించడం లేదు. పోటీ పరీక్షలకు సిద్ధమై ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. తన కుటుంబానికి మరింత మెరుగైన భవిష్యత్తును అందించాలన్నది అతడి కల.

ఇక్కడే పురుషోత్తం కథ మన సమాజానికి ఒక బలమైన సందేశాన్ని ఇస్తుంది. లిలివైకల్యం ఉన్న వ్యక్తికి సాయం అవసరమవచ్చు.. కానీ అతడి సామర్థ్యాన్ని ఎప్పుడూ తక్కువగా అంచనా వేయకూడదు.లిలి అవకాశం లభిస్తే వారు కూడా చదువుకోవచ్చు, ఉద్యోగాలు చేయవచ్చు, కుటుంబాలను పోషించవచ్చు, సమాజానికి ఆదర్శంగా నిలవవచ్చు.

ప్రభుత్వాలు, సంస్థలు కూడా ఇలాంటి వ్యక్తులకు దయతో కాకుండా లిలిఅవకాశాల దృష్టితోలిలి చూడాల్సిన అవసరం ఉంది. అందుబాటులో ఉండే రవాణా, ఉపాధి అవకాశాలు, సాంకేతిక సహాయం, సురక్షితమైన పని వాతావరణం కల్పిస్తే మరెంతో మంది దివ్యాంగులు స్వావలంబన దిశగా అడుగులు వేయగలరు.

పురుషోత్తం వీల్‌చైర్‌పై ప్రయాణిస్తున్నాడు. కానీ అతడి ఆలోచనలు మాత్రం ముందుకు పరుగెడుతున్నాయి. జీవనోపాధి కోసం కష్టపడుతున్నాడు. కుటుంబం కోసం బాధ్యత తీసుకుంటున్నాడు. రోడ్డు భద్రత గురించి ఇతరులకు చెబుతున్నాడు. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కలలు కంటున్నాడు.

అందుకే అతడి కథ వైకల్యానికి సంబంధించిన కథ మాత్రమే కాదు.. సంకల్పానికి సంబంధించిన కథ. శరీరం కొన్ని పరిమితులను విధించవచ్చు. కానీ లక్ష్యాన్ని చేరుకోవాలనే మనసుకు పరిమితులు విధించేది మనమే.

జలసిరి పనులపై ప్రత్యేక దృష్టి..

- క్షేత్రస్థాయి అమలుకు అధికారుల సమీక్ష

శంకర్‌పల్లి, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) : శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సుభాషిని గురువారం పర్యటించి విబి-జీఆర్ ఎయమ్,పనులు,ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన నీటి సంరక్షణ పనులు,కూలీల సమీకరణ, ఇంకుడు గుంతల నిర్మాణం, పశువుల తొట్టెల ఏర్పాటు,మేట్ల నియామకం తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులను సంరక్షించడం,భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించడం, ఉపాధి పనుల్లో కూలీల భాగస్వామ్యాన్ని పెంచడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సమీక్షలో చర్చించారు.చేపట్టాల్సిన పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తూ,గ్రామీణ ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో ఎంపీడీవో వి.ప్రవీణ్ కుమార్,ఎంపీవో గిరిరాజు,ఏపీవో నాగభూషణం,ఈసీ జనార్దన్ రెడ్డి,టీఏ యాదయ్య,కంప్యూటర్ ఆపరేటర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలి

మణికొండ, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) : బీఆర్ఎస్ పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు మణికొండకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాల్యాద్రి నాయుడు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్ కార్యాచరణ, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, రానున్న రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు చర్చించారు. పార్టీ అభివృద్ధి కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలని సబితా ఇంద్రారెడ్డి స్థానిక నాయకులకు సూచించినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామని, పార్టీ పటిష్టతకు కట్టుబడి పనిచేస్తామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్తీక్ రెడ్డి, మాల్యాద్రి నాయుడు, మణికొండకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

3ఏళ్ల వరకు బాల్యవివాహం రద్దు చేయవచ్చు

- ఎంవీ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ స్వామి

- తుకారాంగేట్‌లో యూత్ కమిటీ మీటింగ్

అడ్డగుట్ట, అక్టోబరు30(జర్నలిస్ట్ ఫైల్) : బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని, బాల్య వివాహం జరిగిన 3ఏళ్ల వరకు కూడా రద్దు చేయవచ్చని ఎంవీ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ స్వామి తెలిపారు. మారేడ్ పల్లి మండలం తుకారాంగేట్ బస్తీలో గురువారం జరిగిన యూత్ మీటింగ్ కు ఆయన ముఖ్య అతిదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టంపైన అవగాహణ కల్పించారు. బాలకార్మిక రహిత సమాజం కోసం తీసుకోవాలసిన చర్యలను వివరించారు. బాల్యవివాహాలు చేయడం వలన జరిగే నష్టాలు, బాల్య వివాహాల నిర్వాహకులకు ఎటువంటి శిక్షలు ఉంటాయనే అంశాలను తెలిపి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లి చైతన్య పరచాలని సూచించారు. ఈ సమావేశంలో యూత్ సభ్యులు రాకేష్, మైత్రి, ప్రవళిక, విష్ణు, దివ్య, రోహన్, వైష్ణవి, బాలల హక్కుల పరిరక్షణ వేదిక (సీఆర్పీఎఫ్) మండల కన్వీనర్ ప్రవీణ్, ఎం వీ ఫౌండేషన్ ఆర్గనైజర్లు ఆర్ లత, సుమలత పాల్గొన్నారు.

శివాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రానికి రెండు ప్రెషర్ కుక్కర్లు అందజేత

మణికొండ, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) : మణికొండ 127వ డివిజన్ పరిధిలోని శివాజీ నగర్ అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది అభ్యర్థన మేరకు రోజువారీ వంట అవసరాల కోసం రెండు ప్రెషర్ కుక్కర్లను కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్ అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం అందించే క్రమంలో వంట పనులకు అవసరమైన సామగ్రిని సమకూర్చాలన్న అభ్యర్థనకు స్పందిస్తూ ఆయన ఈ సహాయం అందించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు అవసరమైన సదుపాయాలు కల్పించడం ద్వారా చిన్నారులకు మెరుగైన సేవలు అందించేందుకు తోడ్పడవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముత్యాలు, మణికొండ మహిళా అధ్యక్షురాలు సావిత్రి, నెక్నాంపూర్ మహిళా అధ్యక్షురాలు ప్రభావతి, మణికొండ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్, శివాజీ నగర్ ఉపాధ్యక్షులు నరసింహ, చిరంజీవి, స్పందన తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ కాలనీలో మంచినీటి పైప్‌లైన్ లీకేజీ..

మణికొండ, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) : మణికొండ డివిజన్ పరిధిలోని పోచమ్మ కాలనీలో మంచినీటి పైప్‌లైన్ లీకేజీ కావడంతో సంబంధిత అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు, స్థానిక నాయకులు కాలనీలో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగా స్థానికంగా తలెత్తిన సమస్యను పరిష్కరించేందుకు చేపట్టిన పనుల పురోగతిని అధికారులు సమీక్షించారు. మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా లీకేజీని త్వరగా సరిచేసి, స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరారు.

పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- ఫారం-18 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి.. డూప్లికేట్ ఓట్లను తిరస్కరించాలి
- అధికారులకు అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశాలు

నల్లగొండ, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) : నల్లగొండ-వరంగల్- ఖమ్మం, పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గానికి సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫారం-18 దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని, డూప్లికేట్ ఓట్లను నిబంధనల ప్రకారం తిరస్కరించాలని సూచించారు. గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లోని వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్వో) ఛాంబర్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాల ఈఆర్వోలు, ఆర్డీవోలతో ఆయన సమీక్ష నిర్వహించారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో నల్లగొండ జిల్లా ముందుండటంపై జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులను, సిబ్బందిని అభినందించారు. యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లోనూ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. దరఖాస్తులు అందిన వెంటనే క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన పట్టభద్రులకు ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల మెమోలు, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, ఉద్యోగుల ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి, విశ్వవిద్యాలయాలు జారీ చేసిన ధ్రువపత్రాల పరిశీలనను వేగవంతం చేయాలన్నారు.బీఎల్ఓలు ఓటర్ల నివాస వివరాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని, విద్యార్హతల ధ్రువీకరణను సంబంధిత అధికారులు పరిశీలించాలని స్పష్టం చేశారు. ముసాయిదా ఓటరు జాబితా, ఓటరు చీటీల పరిశీలనలో అప్రమత్తంగా ఉండాలని, చిరునామా మార్పు దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. ఓటర్లకు అందుబాటులో ఉండేలా పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేయాలని, ఉపాధ్యాయులకు నివాస ప్రాంతాలకు సమీపంలో పోలింగ్ కేంద్రాలు కేటాయించే అంశాన్ని పరిశీలించాలన్నారు.నిర్ణీత గడువులోగా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, జంబో బ్యాలెట్ బాక్సుల లభ్యతపై సమీక్షించి, ఏ జిల్లాలోనైనా సామగ్రి కొరత ఉంటే వెంటనే తెలియజేయాలని అధికారులకు సూచించారు.రెడు షిఫ్టుల్లో దరఖాస్తుల పరిశీలన.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డీటీసీలోని కంప్యూటర్ కేంద్రంలో 20 కంప్యూటర్లను ఏర్పాటు చేసి, సిబ్బందితో రెండు షిఫ్టుల్లో రాత్రింబవళ్లు దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు వివరించారు.ఎంజీ యూనివర్సిటీ విద్యార్థుల సహకారం తీసుకుంటున్నామని, ఆర్డీవో స్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు. రానున్న నాలుగు రోజుల్లో ఓటరు నమోదు సంఖ్య గణనీయంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి, ఉమ్మడి జిల్లాల ఈఆర్వోలు, ఆర్డీవోలు, ఏఈఆర్వోలు (తహసీల్దారులు), ఎన్నికల అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పంటను దళారులకు అమ్మి మోసపోవద్దు యాసంగి సాగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

బొమ్మలరామారం, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) : పంటను దళారుల అమ్మి మోసపోవద్దని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య రైతులకు సూచించారు గురువారం మండలంలోని మర్యాల, చౌదర్ పల్లి గ్రామంలో రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో రెండో వరి పంట సాగులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపా రు.రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రెండో పంట సాగుపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలన్నారు.అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలని సూచించారు. ధాన్యం విక్రయించిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు.ఈ కార్య క్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర సత్యనారాయ ణ, తాసిల్దార్ రాధా, సింగిల్ విండో చైర్మన్ సింగర్తి మల్లేష్, భువనగిరి మార్కెట్ కమిటీ తాజా మాజీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్,ఆత్మ కమిటీ చైర్మన్ ఎనగండ్ల సుధాకర్, సింగిల్ విండో డైరెక్టర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, మహిళా అధ్యక్షురాలు యంజాల కళ,పలు గ్రామాల సర్పంచులు, మహిళ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

రోడ్డు కోసం కాలనీవాసుల పోరుబాట

- ఆరు కాలనీలకు అనుసంధాన రహదారి కల్పించాలి
- కలెక్టర్ చొరవతో సర్వేకు ఏర్పాట్లు.. సమస్య పరిష్కరించాలని ప్రజల విజ్ఞప్తి.

నల్లగొండ, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) : నల్గొండ నగరంలోని 9వ డివిజన్ వెంకటరమణ కాలనీ కార్పొరేటర్ డీప్లా నాయక్ మరియు కాలనీవాసులు, పరిసర కాలనీల ప్రజలు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీ నుంచి ప్రధాన రహదారికి అనుసంధానంగా సుమారు 100 మీటర్ల మేర రోడ్డు ఏర్పాటు చేస్తే వేలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు కోరుతున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని ఇప్పటికే పలుమార్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేసిన కాలనీవాసులు, తాజాగా అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించనున్న నేపథ్యంలో మరోసారి సమావేశమై తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

వంద మీటర్ల రోడ్డు.. వేలాది కుటుంబాలకు ఉపశమనం:

కాలనీలకు ప్రధాన రహదారి అందుబాటులో ఉన్నప్పటికీ, దానికి అనుసంధానంగా అంతర్గత రహదారి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. సుమారు 100 మీటర్ల మేర రోడ్డు ఏర్పాటు చేస్తే వెంకటరమణ కాలనీ, పటేల్‌నగర్, వసుంధర కాలనీ, కనకదుర్గ కాలనీ, సూర్యవంశీ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు సులభంగా ప్రధాన రహదారికి చేరుకోవచ్చని వివరించారు.ప్రస్తుతం ప్రధాన రహదారికి చేరుకోవడానికి అదనంగా సుమారు కిలోమీటరు దూరం ప్రయాణించాల్సి వస్తోందని, ప్రతిపాదిత రహదారి అందుబాటులోకి వస్తే కేవలం రెండు మూడు నిమిషాల్లోనే ప్రధాన రహదారికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు, వృద్ధులు ఆసుపత్రులకు చేరుకునేందుకు, అత్యవసర సమయాల్లో వాహనాల రాకపోకలకు రోడ్డు లేకపోవడం ప్రధాన అడ్డంకిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులు జరిగినా.. రోడ్డు మాత్రం లేదు:

కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టినప్పటికీ, రహదారి నిర్మాణం మాత్రం జరగలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్ స్థాయికి అభివృద్ధి విస్తరిస్తున్నప్పటికీ తమ కాలనీలో కనీస రహదారి సౌకర్యం లేకపోవడం బాధాకరమన్నారు.ప్రధాన రహదారికి ఎదురుగా ఉన్న ప్రాంతంలో పోలీస్ స్టేషన్‌కు, నిర్మాణం చేపట్టినట్లు స్థానికులు తెలిపారు. ఆ నిర్మాణాలు పూర్తిస్థాయిలో ప్రారంభమైతే కాలనీకి రాకపోకలు మరింత ఇబ్బందికరంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపాదిత రహదారి ప్రభుత్వ భూమి మీదుగా ఏర్పాటు చేసే అంశంపై అధికారులు పరిశీలించి, ప్రజలకు ఉపయోగపడేలా తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్, ఎస్పీకి పలుమార్లు వినతి:

రోడ్డు సమస్య పరిష్కారం కోసం కాలనీవాసులు ఇప్పటికే రెండు పర్యాయాలు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీని కూడా కలిసి సమస్యను వివరించామని పేర్కొన్నారు. ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించడంతో పాటు సంబంధిత పోలీసు అధికారిని పంపిస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.అనంతరం మరోసారి కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించగా, సంబంధిత ఎంఆర్ఓ, ఎంపీఓ అధికారులకు పరిశీలన బాధ్యతలు అప్పగించినట్లు కాలనీవాసులు తెలిపారు.తాజాగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఆర్ఓ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించేందుకు చర్యలు చేపట్టడంతో సమస్య పరిష్కారంపై స్థానికుల్లో ఆశలు చిగురించాయి. సర్వే అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు వారు తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా.. ప్రజా ప్రయోజనమే లక్ష్యం:

తమ పోరాటం రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, ప్రజల కనీస అవసరమైన రహదారి సౌకర్యం కోసం మాత్రమేనని కాలనీవాసులు స్పష్టం చేశారు.కాలనీలో ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న సమయంలో రహదారి సౌకర్యం ఉంటుందనే నమ్మకంతోనే స్థిరపడ్డామని తెలిపారు. ప్రస్తుతం రోడ్డు లేకపోవడంతో కొత్తగా ఇళ్లు నిర్మించుకోవాలన్నా, పెద్ద వాహనాలు తీసుకురావాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.కాలనీ ప్రజలు కూడా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పౌరులేనని, తమ సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించి పరిష్కరించాలని కోరారు. ఓట్ల సమయంలో మాత్రమే కాకుండా ప్రజల నిత్యజీవిత సమస్యల పరిష్కారంలోనూ నాయకులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు మంజూరు చేయాలి:

ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం పరిశీలించి, ప్రజల రాకపోకలకు అనుకూలంగా రహదారి ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సమస్య పరిష్కారం కాకపోతే తమ కుటుంబాలతో కలిసి ఆందోళన చేపట్టాల్సి వస్తుందని, అవసరమైతే జాతీయ రహదారిపై నిరసనకు దిగుతామని హెచ్చరించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి రహదారి నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మఠంపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన కోదాడ డీఎస్పీ

- గంజాయి,డ్రగ్స్,రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా...
- బాధితుల ఇంటి వద్దకే ఎఫ్ఐఆర్ సేవలు..
- మహిళల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ..

మఠంపల్లి, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) : శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణే లక్ష్యంగా పనిచేస్తున్నామని కోదాడ డీఎస్పీ ఆర్.శ్రీనివాస్ రెడ్డి అన్నారు.వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం మఠంపల్లి మండల పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన స్టేషన్ నిర్వహణ,కేసుల పురోగతి,నేరాల నియంత్రణ చర్యలపై ప్రత్యేకంగా సమీక్షించారు.స్టేషన్‌కు చేరుకున్న డీఎస్పీకి హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమంద రాజు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి, వివిధ రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల వివరాలను మండల ఎస్సై బి.ప్రవీణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు,నేరాల నియంత్రణకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి తగిన సూచనలు చేశారు.స్టేషన్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో సిఐ,ఎస్సైతో కలిసి మొక్కను నాటారు.

సరిహద్దు చెక్‌పోస్టుపై ప్రత్యేక నిఘా:

మఠంపల్లి మండల పరిధిలోని మట్టపల్లి అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు.గంజాయి, మాదకద్రవ్యాలు,రేషన్ బియ్యం,ధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగి స్తున్నట్లు పేర్కొన్నారు. అనుమానాస్పద వాహనాలు,వ్యక్తుల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని పోలీస్ సిబ్బందికి ఆదేశించారు.మండలంలోని సిమెంట్ పరిశ్రమల్లో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కార్మికుల కదలికలపై కూడా నిఘా ఉంచుతున్నట్లు వెల్లడించారు. రౌడీషీటర్లు, అనుమానితుల కార్యకలాపాలపై నిఘా ఉంచామని తెలిపారు. గ్రామాల్లో దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు,నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీసు సిబ్బందికి ఆదేశించారు.

బాధితులకు భరోసా.. ఇంటి వద్దకే ఎఫ్ఐఆర్ సేవలు:

నేరాల బారినపడి స్టేషన్ కు రాలేని వృద్ధులు,మహిళ బాధితులకు పోలీసు వ్యవస్థ అండగా ఉంటుందని డీఎస్పీ పేర్కొన్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావడంలో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల్లో అవసరాన్ని బట్టి పోలీస్ సిబ్బంది వారి ఇంటి వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు తదితర సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బాధితులకు న్యాయంపై నమ్మకం కల్పిస్తూ వారికి భరోసా ఇచ్చే విధంగా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.మహిళలు తమ సమస్యలను ఎలాంటి సంకోచం లేకుండా పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక మహిళా సహాయ కేంద్రం (వుమెన్ హెల్ప్ డెస్క్) ద్వారా సేవలు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. మహిళా కానిస్టేబుల్ సహకారంతో ఫిర్యాదులను స్వీకరించి గృహహింసకు గురవుతున్న మహిళల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకున్నామని తెలిపారు.

దయల్ 100కు తక్షణ స్పందన..సైబర్ నేరాలపై అవగాహన:

ప్రజల నుంచి దయల్ 100కు అందే ఫిర్యాదులపై వేగంగా స్పందించి ఘటనాస్థలికి చేరుకోవాలని డీఎస్పీ సూచించారు. గ్రామాల్లో పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు చేరువ కావాలని, నిరంతర పెట్రోలింగ్‌తో నేరాలకు అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత ఏడాదిలో కేసుల సంఖ్య పెరిగిందా, తగ్గిందా అనే అంశాలను సమీక్షించారు. కేసుల సంఖ్య పెరిగినట్లయితే అందుకు గల కారణాలను గుర్తించి, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రమాద బాధితులకు సత్వర వైద్యం.. రహవీర్‌లకు ప్రోత్సాహకం:

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆస్పత్రికి తరలించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని డీఎస్పీ తెలిపారు. పీఎం రాహత్ పథకం కింద ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన రోజు నుంచి ఏడు రోజుల వరకు గరిష్ఠంగా రూ.1.50 లక్షల మేర నగదు రహిత వైద్య చికిత్స అందించే అవకాశం ఉందని వివరించారు.

ప్రమాద బాధితులను ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు కాపాడే 'రహవీర్'లకు రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందించడంతో పాటు, నిబంధనల ప్రకారం పోలీసు, న్యాయపరమైన ఇబ్బందుల నుంచి రక్షణ కల్పించే వెసులుబాటు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రమాద బాధితులకు సాయం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ నేరాల నియంత్రణలో సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని పారదర్శకంగా విధులు నిర్వహించి పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంపొందించాలని డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి పోలీస్ సిబ్బందికి సూచించారు.

68వ రోజుకు చేరిన దీక్షకు ట్రాక్టర్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు!

- సానుకూల స్పందన కరువు.. ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం!
- విజయం సాధించే వరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. ట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధుల స్పష్టీకరణ.

జిన్నారం, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :
తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సాగుతున్న దీక్ష 68వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో ట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఇన్ని రోజులుగా శాంతియుతంగా, సానుకూల దృక్పథంతో పోరాటం సాగిస్తున్నప్పటికీ సంబంధిత వర్గాల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ట్రాక్టర్ అసోసియేషన్‌కు చెందిన బొంతల చంద్రమౌళి, అనుముల శ్రీనివాస్,కొత్త తిరుపతి,కాశెట్టి శ్రీనివాస్,కటకం సతీష్,రాథోడ్ తుకారాం తదితరులు దీక్షకు మద్దతు తెలిపారు. సమస్య పరిష్కారం కోసం ఇంతకాలం ఓర్పుతో ఎదురుచూసినా సానుకూల స్పందన కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.ఇక ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని వారు స్పష్టం చేశారు. శాంతియుతంగా చేస్తున్న పోరాటానికి స్పందించకపోతే, తదుపరి కార్యాచరణను రూపొందించి ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను, న్యాయమైన డిమాండ్లను సంబంధిత అధికారులు, పాలకులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించాలని కోరారు.ఎన్ని రోజులు పట్టినా,ఎన్ని ఆటంకాలు ఎదురైనా లక్ష్యం సాధించే వరకు ఉద్యమాన్ని విరమించే ప్రసక్తే లేదని వారు తేల్చిచెప్పారు.68 రోజులుగా కొనసాగుతున్న దీక్షకు మరింత ప్రజా మద్దతు కూడగట్టి,ఐక్యంగా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. న్యాయం జరిగే వరకు వెనకడుగు వేయబోమని, విజయం సాధించడమే తమ అంతిమ లక్ష్యమని ట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే అధికారుల ప్రథమ కర్తవ్యం!

- గ్రామాల్లో సమస్యలపై నిర్లక్ష్యం వద్దు. ఎప్పటికప్పుడు పరిష్కార చర్యలు చేపట్టాలి!
- ఎల్‌నినో ప్రభావాలపై అప్రమత్తంగా ఉండాలి. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్.

జిన్నారం, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :
ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.గురువారం మధ్యాహ్నం జన్నారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండలస్థాయి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.ప్రజల అవసరాలు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు నిరంతరం దృష్టి సారించాలని, సమస్యలు తమ దృష్టికి వచ్చినప్పుడు కాలయాపన చేయకుండా పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు.ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెంపొందించుకొని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిపాలనా సేవలను అందించాలని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పరిష్కారాల అమలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. వాతావరణ పరిస్థితుల ప్రభావాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.ప్రజల సమస్యలను పరిష్కరించడమే పరిపాలనకు ప్రధాన లక్ష్యమని, అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు మార్కెట్ కమిటీ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీ నారాయణ ఏఎంసీ చైర్మన్ అల్లం రవి ఎంపీడీవో ఉమర్ షరీఫ్ తాసిల్దార్ బక్కన్న మండలంలోని అన్ని శాఖల అధికారులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు

సాగర సంఘం భవన నిర్మాణానికి ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి వినతి

- వ్యక్తిగత సహాయం అందిస్తానని హామీ ఇచ్చిన రవికుమార్ యాదవ్

శేరిలింగంపల్లి, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :
శేరిలింగంపల్లి నియోజకవర్గం, హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్ నగర్ సాగర (ఉప్పర) సంఘం భవన నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ, బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు బోయిని మహేష్ యాదవ్ నాయకత్వంలో సాగర సంఘం ప్రతినిధులు చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డిని, శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ ని కలిసి వినతిపత్రాలు అందజేశారు.సాగర సంఘం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, స్థానిక ప్రజలకు ఉపయోగపడే విధంగా సంఘ భవనాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని ప్రతినిధులు వివరించారు. ఈ భవన నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నిధుల ద్వారా సహాయం అందించాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కోరారు.ఈ వినతిపై స్పందించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నిబంధనలు మరియు అందుబాటులో ఉన్న నిధుల ప్రకారం ఎంపీ ల్యాడ్స్ ద్వారా సహాయం అందించే అంశాన్ని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా రవికుమార్ యాదవ్ కూడా సంఘ భవన నిర్మాణానికి తన వంతుగా వ్యక్తిగత ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.సామాజిక వర్గాల అభివృద్ధికి, ప్రజల ఐక్యతకు, సామాజిక సేవా కార్యక్రమాలకు సంఘ భవనాలు ఎంతో అవసరమని, ఈ భవన నిర్మాణం పూర్తయితే సాగర సంఘ సభ్యులతో పాటు స్థానిక ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని ప్రతినిధులు తెలిపారు.సంఘ అభివృద్ధికి స్పందించి సహాయం అందిస్తామని హామీ ఇచ్చిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి కి, రవికుమార్ యాదవ్ కి సాగర సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సాగర సంఘం గౌరవ అధ్యక్షులు మెడల గోవర్ధన్ సాగర్, అధ్యక్షులు శ్రీనివాసులు సాగర్, బీమ్ సేన్ సాగర్, ఆలేటి మూర్తి సాగర్, చిన్న రాయుడు సాగర్, శేఖర్ సాగర్, శ్రీనివాస్ సాగర్ తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన మాజీ మంత్రి చిన్నారెడ్డి

- ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాల నిర్మాణం కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా చాలా అద్భుతంగా ఉంది

ఇబ్రహీంపట్నం, (జర్నలిస్ట్ ఫైల్) :
మంచాల మండలం తెలంగాణ రాష్ట్రంలోనే,మొట్టమొదటిసారీగా,నిర్మించిన ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలను సందర్శించిన మాజీమంత్రి తెలంగాణ రాష్ట్రప్లానింగ్ కమిషన్ మాజీ చైర్మన్ జి చిన్నారెడ్డి ప్రొఫెసర్ ప్రొఫెసర్ జలంధర్ రెడ్డి మరియు వారి బృందం పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి అక్కడి వసతులు తరగతి గదులు క్రీడామైదానాలు నిర్వహణను పరిశీలించారు అంతరం ఈసందర్భంగా మాట్లాడుతూ,ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాల నిర్మాణం కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా విద్యార్థులకు అన్ని వసతులతో నిర్మాణం చాలా అద్భుతంగా ఉంది అని ఆనందం వ్యక్తంచేశారు.ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ పాఠశాలలో చదువుకునే ఇక్కడి ప్రాంతం విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుంది అని అన్నారు పాఠశాలలోని చక్కని వాతావరణంమె రుగైన నిర్వహణను చూసి ఇలాంటి పాఠశాలలో చదువుకునే విద్యార్థులు నిజంగా అదృష్ట వం తులని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్ధగోని గిరిధర్ గౌడ్ తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జలవర్న రా ములు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ గౌడ్ పాఠశాల ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలు ప్రజాగలం దామర భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో ఘనంగా రక్తదాన శిబిరం

- దర్పల్లి సర్కిల్ నుండి 25 మంది పోలీస్ సిబ్బంది రక్తదానం
- రక్తదాతలను అభినందించిన నిజామాబాద్ సీపీ సాయి చైతన్య

నిజామాబాద్ రూరల్, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) : "రక్తదానం – ప్రాణదానం. మనమిచ్చే రక్తపు బొట్టు మరొకరి జీవితంలో వెలుగులు నింపుతుంది. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి" అని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ (సీపీ) సాయి చైతన్య పిలుపునిచ్చారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నిజామాబాద్ సీపీ గారి ఆధ్వర్యంలో స్థానిక AR హెడ్‌క్వార్టర్స్‌లో భారీ రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజ రక్షణలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ చేపట్టిన ఈ సామాజిక సేవా కార్యక్రమంలో దర్పల్లి సర్కిల్ పరిధికి చెందిన 25 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు.ఈ సందర్భంగా రక్తదానం చేసిన పోలీస్ సిబ్బందిని సీపీ సాయి చైతన్య ప్రత్యేకంగా అభినందించారు. విధుల నిర్వహణలోనే కాకుండా, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దర్పల్లి సీఐ రామన్, దర్పల్లి ఎస్ఐ సందీప్, సిరికొండ ఎస్ఐ రామకృష్ణ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బొగ్గవరపు సోమయ్య దశ దిశ కర్మకు హాజరైన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు

నూతి సత్యనారాయణ గౌడ్

- కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు

బోనకల్, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) :
బోనకల్ మండల పరిధిలో గల చొప్పకట్లపాలెం కాంగ్రెస్ మాజీ గ్రామ అధ్యక్షుడుబోనకల్ బొగ్గవరపు సోమయ్య గారి దశదిన కార్యక్రమానికి హాజరై వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ బోనకల్ మండలంలో చొప్పకట్ల పాలెం గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు బొగ్గవరపు సోమయ్య దశదిన కార్యక్రమానికి హాజరై వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించినారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు బోనకల్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు నందాల నిరంజన్, మేకల వేలాద్రి,ఎర్రశెట్టి సుబ్బారావు, మర్సకట్ల సంజీవరావు,యడ్లపల్లి వీరయ్య చౌదరి, తాళ్లూరి రామారావు శివాలయ చైర్మన్ మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్ పాదయాత్రకు బీసీ సంక్షేమ సంఘం సంఘీభావం

శామీర్‌పేట, అక్టోబరు 30 (జర్నలిస్ట్ ఫైల్) : జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్రకు బీసీ సంక్షేమ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పాదయాత్రకు మద్దతు ప్రకటిస్తూ బీసీ సంఘాల ప్రతినిధులు, నాయకులు పాల్గొని తమ ఐక్యతను చాటారు.ఈ సందర్భంగా జాతీయ విద్యార్థి సంఘం అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ రమేష్ గౌడ్‌తో పాటు మహేందర్ గౌడ్, గౌతమ్ తదితర బీసీ నాయకులు పాదయాత్రలో పాల్గొని ఎంపీ ఈటల రాజేందర్‌కు సంఘీభావం ప్రకటించారు.డంపింగ్ యార్డు కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు ఆకాంక్షించారు.ప్రజా సమస్యలపై చేపట్టే పోరాటాలకు బీసీ సంఘాల మద్దతు ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. పాదయాత్రలో బీసీ నాయకులు పాల్గొనడం ద్వారా డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం సాగుతున్న ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.

నగర అభివృద్ధి మీ చేతుల్లో..

- కూటమి అభ్యర్థుల గెలుపు.. గుంటూరు అభివృద్ధికి మేల్కొలుపు
- మేయర్ గా లక్ష్మీఅపర్ణకు మద్దతు పలకండి
- ఓటరులారా ఆలోచించి ఓటెయ్యండి
- అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తు చేసుకోండి
- 3,4,5,6,13,14 డివిజన్ల ప్రచారంలో ఎమ్మెల్యే నసీర్, మేయర్ అభ్యర్థి లక్ష్మీఅపర్ణ

గుంటూరు, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు అభివృద్ధిలో నూతన అధ్యాయం ప్రారంభం కాబోతోందని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక తూర్పు నియోజకవర్గంలో 3, 4, 5, 6, 13, 14 డివిజన్ల కార్పొరేటర్ అభ్యర్థులు, మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీఅపర్ణతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ఎన్నిక ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత మేయర్ గా పని చేసిన కోవెలమూడి రవీంద్ర (నాని) ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అదే కుటుంబానికి చెందిన లక్ష్మీఅపర్ణను మేయర్ గా గెలిపించడం ద్వారా మళ్లీ గుంటూరు ప్రగతిని రెట్టింపు చేయబోతున్నామని అన్నారు. తూర్పు నియోజకవర్గంలో గుంతలు లేని రోడ్లను ప్రజలను తీంంచామని తెలిపారు. శానిటేషన్ పై ఎప్పటికప్పుడు ప్రత్యేకమైన చొరవ చూపిస్తూ డ్రెయిన్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. ఎన్నో ఏళ్లుగా గుంటూరు నగర ప్రజలను వేధిస్తోన్న వరద నీటి ముంపు సమస్య పరిష్కారానికి మొండిగేటు వద్ద వెంట్ నిర్మాణం చేపట్టామని తెలిపారు.

రైల్వే అధికారులను ఒప్పించి రూ. 8 కోట్ల నిధులు రాబట్టామని, ఇది పూర్తి చేస్తే గుంటూరు నగరానికి ముంపు సమస్య తొలగిపోతుందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజలను అన్ని రంగాల్లోనూ నిండా ముంచారని, ప్రధానమైన ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టలేదని మండిపడ్డారు. కేవలం రెండున్నరేళ్ల కాలంలో అభివృద్ధికి కొత్త నిర్వచనం రచించామని, ఇది ఇతర ప్రాంతాలకు అదర్శంగా నిలుస్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విద్య, వైద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధించామని తెలిపారు.

గూగుల్ వంటి సంస్థలను రాష్ట్రానికి తీసుకురావడమే కాకుండా అమరావతి వంటి ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం ద్వారా యువత భవితకు భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఒక్కసారి ఆలోచించి కూటమి అభ్యర్థులను మనసారా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అభ్యర్థులు షేక్ షబానా, ఐలా అనిత, దొడ్ల లక్ష్మీ, సాయి, గాలి సతీష్ బాబు, యల్లావుల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు పశ్చిమలో కూటమి ప్రచార హోరు

- భారీ బైక్ ర్యాలీతో హోరెత్తిన ప్రధాన రహదారులు

గుంటూరు, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థుల తరపున భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చుట్టుగుంట సెంటర్ వద్ద ఎమ్మెల్యే జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

చుట్టుగుంట నుంచి వీఐపీ రోడ్డు, మనీ హోటల్ సెంటర్, చిలకలూరిపేట రోడ్డు, సుబ్బారెడ్డి నగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఏటీ అగ్రహారం బోరింగ్ సెంటర్, శ్రీరామ్ నగర్, మన్యం కాలనీల మీదుగా ర్యాలీ కొనసాగింది. ఎస్‌కేబీఎం స్కూల్ రోడ్డు మీదుగా తిరిగి చుట్టుగుంట చేరుకున్న అనంతరం శ్రీనివాసరావుపేట, రామనామ క్షేత్రం, నల్లచెరువు మెయిన్ రోడ్డు మీదుగా మూడు బొమ్మల సెంటర్‌కు చేరుకుని ముగిసింది.

కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

ఫాతిమాపురంలో పట్టాల సమస్యపై ఎమ్మెల్యే హామీ

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 47వ డివిజన్ ఫాతిమాపురంలో ఎన్డీయే కూటమి అభ్యర్థి షమా పఠాన్‌కు మద్దతుగా గళ్ళా మాధవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఫాతిమాపురంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. భూముల స్వరూపం, యాజమాన్య హక్కులు, గతంలో జరిగిన పరిణామాలను పూర్తిగా పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించి మాత్రమే హామీలు ఇస్తానని గళ్ళా మాధవి పేర్కొన్నారు. 2024లో ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతరం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని అభివృద్ధి పనులకు కృషి చేస్తున్నామని తెలిపారు.

పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

28వ డివిజన్ కొండా వెంకటప్పయ్య కాలనీలో ఎన్డీయే కూటమి జనసేన అభ్యర్థి దొంతా హైమావతికి మద్దతుగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు.

దొంతా హైమావతికి గాజు గ్లాసు గుర్తుపై, మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ఆమె కోరారు. స్థానిక సమస్యలను కౌన్సిల్‌లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేసేలా అభ్యర్థులకు బాధ్యత అప్పగించాలని సూచించారు.

ఎన్నికల ప్రచారానికి సమయం తక్కువగా ఉన్నందున కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టామని, పెండింగ్‌లో ఉన్న పనులను కూడా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమష్టి కృషితో గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తామని గళ్ళా మాధవి పేర్కొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమమే శాఖ ప్రాధాన్యం

- ప్రతి సమస్యకు నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కారం : ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు.

జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నుంచి వ్యక్తిగత, సేవా సంబంధిత సమస్యలు, బదిలీలు, పదోన్నతులు, సెలవులు, వైద్య అవసరాలు, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన వినతులను ఎస్పీ స్వీకరించారు.

ప్రతి వినతిని ఎస్పీ స్వయంగా పరిశీలించి, పోలీస్ శాఖ నిబంధనలకు అనుగుణంగా వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.

సిబ్బంది సమస్యలు సకాలంలో పరిష్కారమైతే విధి నిర్వహణలో సామర్థ్యం, నిబద్ధత, ఉత్సాహం మరింత పెరుగుతాయని ఎస్పీ పేర్కొన్నారు. బదిలీలు, పదోన్నతులు, ఇతర పరిపాలనా నిర్ణయాలను శాఖ నిబంధనలు, ఖాళీలు, పరిపాలనా అవసరాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా చేపడతామని తెలిపారు.

పోలీస్ సిబ్బంది ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఎస్పీ సూచించారు. సిబ్బంది సంక్షేమం మెరుగుపడితే ప్రజలకు మరింత సమర్థవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించగలమని అన్నారు.

విధి నిర్వహణలో ప్రతి పోలీస్ సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన, అంకితభావంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం, భద్రతాభావం మరింత పెంపొందేలా సేవలందించాలని ఆదేశించారు.

పోలీస్ శాఖ ఒక కుటుంబం. పరస్పర సహకారం, సమన్వయం, గౌరవంతో పనిచేసినప్పుడే సంస్థ మరింత బలోపేతం అవుతుంది. సిబ్బంది సంక్షేమం కోసం గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు.

మోదుకూరులో కూటమి అభ్యర్థుల తరపున ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు ఇంటింటి ప్రచారం

మోదుకూరు, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి అభ్యర్థుల తరపున ప్రచారం చేశారు. చుండూరు మండల జడ్పీటీసీ అభ్యర్థి వలివేటి నాగమల్లేశ్వరి, మోదుకూరు ఎంపీటీసీ-1 అభ్యర్థి ముళ్లపూడి సుజాత, ఎంపీటీసీ-2 అభ్యర్థి అన్నపరెడ్డి రాధారాణికి మద్దతుగా ఎమ్మెల్యే ఓటర్లను కలుసుకున్నారు. ఆయా అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

వేమూరు నియోజకవర్గంలోని వివిధ ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నక్కా ఆనంద బాబు పిలుపునిచ్చారు.

తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై, జనసేన పార్టీ అభ్యర్థులకు గ్లాస్ గుర్తుపై, బీజేపీ అభ్యర్థులకు కమలం గుర్తుపై ఓటు వేయాలని ఆయన ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాహ్నవి రెడ్డికి భారీ మెజార్టీ సాధించేలా కృషి చేయాలి

- సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని దారపనేని చంద్రశేఖర్, మానం మల్లికార్జున పిలుపు

కనిగిరి అక్టోబర్ 30 (జర్నలిస్ట్ ఫైల్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలో ఈనెల 5వ తేదీన జరగనున్న జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి బైరెడ్డి జాహ్నవి రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కనిగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, మానం మల్లికార్జున ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా తూర్పు కోడిగుడ్లపాడు గ్రామంలోని ఇరిగినేని నగర్ బీసీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో ధారపనేని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థికి మద్దతు తెలపాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాహ్నవి రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కూటమి అభ్యర్థి జాహ్నవి రెడ్డి ప్రచార కార్యక్రమంలో మిరియం సుబ్బరాయుడు, తిరివీధి ముకుందరావు, తిరి వీధి హజరత్ ,తిరి వీధి చంద్ర,మక్కా నాగరాజు, మానం నాగేశ్వరరావు, దేవరకొండ చెన్నకేశవులు, అంకయ్య, బాలయ్య, దండే వెంకటేశ్వర్లు , దండి వెంకటేశ్వర్లు (మాదరపాకం) చీమల దీన్ని మల్లికార్జున, ఇర్లా చిన్న వెంగయ్య,చెనికల రవి, చెనికల మల్లికార్జున, మానం నాగేంద్ర, మానం కిరణ్, చెనికల రామయ్య, చెనికల మాల కొండయ్య (బిస్కట్) మానం వెంకట బాజీ, ఇర్ల రాజు, ఇర్ల రమేష్, మానం వెంకట బాజీ, ఇర్ల చిర్రయ్య , జంగమయ్య, ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఉన్నారు.

సైలెంట్ పీరియడ్ పాటించాలి

గుంటూరు, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): పోలింగ్ కు ముందు 48 గంటల సైలెంట్ పీరియడ్ విధిగా పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల సంసిద్ధతపై జిల్లా ఎన్నికల అధికారులతో శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఎస్. ఇ.సి కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ మాట్లాడుతూ ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఎవరూ ఉండరాదని స్పష్టం చేశారు

⇔48 గంటల ముందు మద్యం విక్రయాలపై నిషేధం అమలు పక్కాగా అమలు కావాలి

⇔సెక్షన్ 144 పకడ్బందీగా అమలు కావాలి

⇔పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్లు లోపల ఎవరు ఉండరాదు.

⇔వంద మీటర్ల తరువాత కూడా ఓటరును ప్రభావితం చేసే అంశాలు ఉండరాదు

⇔పోలింగ్ కేంద్రాల్లోకి ఏ వ్యక్తి పార్టీల కండువాలతో వెళ్ళరాదు

⇔ప్రజా ప్రతినిధులతో గన్ మెన్ లు వెళ్ళరాదు

⇔పోలింగ్ రోజు, నవంబరు 1వ తేదీన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా వేతనంతో కూడిన సెలవు ప్రకటించడం జరిగింది

⇔మీడియా ప్రతినిధులు ఎన్నికల అధికారుల సూచనలు పాటించాలి

⇔ఓటు హక్కు గోప్యతను విధిగా పాటించాలి

⇔పోలింగ్ కేంద్రంలో ఎటువంటి ఇంటర్వ్యూలు నిర్వహించరాదు

⇔సున్నిత, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉన్నామన్నారు. 48 గంటల ముందు మద్యం విక్రయాలు, పోలింగ్ రోజున సెలవుపైన ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఎవరూ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ సూపరింటెండెంట్ ను కోరడం జరిగిందన్నారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుతంగా, పారదర్శకంగా జరుగుటకు అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి పాల్గొన్నారు.

పోలీసుల కవాతు - ప్రజలకు భరోసా

మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్): నవంబర్ 1న జరగనున్న మైదుకూరు మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మైదుకూరు సబ్ డివిజన్ డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో, పోలీసు అధికారులు హాజీవలి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మైదుకూరు అర్బన్ పోలీస్ స్టేషన్, శివశంకర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మైదుకూరు రూరల్ సర్కిల్, చిరంజీవి, వెంకటరమణ, శివప్రసాద్, చిన్నపెద్దయ్య, ధనుంజయుడు తదితర పోలీసు అధికారులు మరియు రిజర్వ్ పోలీసు సిబ్బందితో కలిసి మైదుకూరు పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించడం జరిగింది.

ఈ కవాతు ద్వారా ప్రజలకు పోలీసు శాఖ తరఫున భరోసా కల్పించడంతో పాటు, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా తగిన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలియజేయడం జరిగింది.

మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని విధాలా సిద్ధంగా ఉంది. ప్రజలు ఎలాంటి వదంతులు, అపోహలను నమ్మకుండా, ప్రలోభాలకు లేదా బెదిరింపులకు గురికాకుండా తమ అమూల్యమైన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని మైదుకూరు పోలీసు శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

వైసీపీ గెలుపు - ప్రగతికి మలుపు : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

గుంటూరు, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): కూటమి పాలనలో సంక్షేమం శూన్యమని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి ఆరోపించారు. అన్ని రంగాలలో సంక్షోభం తాండవిస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో "వైసీపీ అభ్యర్థుల గెలుపు - అభివృద్ధికి మలుపు" అని ఆయన స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన శుక్రవారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి గుంటూరులో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా పలకలూరు విచ్చేసిన ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మంగళ హారతులతో పూల జల్లు కురిపించారు. ఆత్మీయత, అభిమానం పంచుతూ ఎదురేగి స్వాగతించారు. రెండు ఓట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే వేసి అఖండ మెజారిటీతో గెలిపిస్తామని గొంతెత్తి నినదించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి నూనె దశరధరామిరెడ్డి, మేయర్ అభ్యర్థిని తాడికొండ శ్రీదేవిని గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పలకలూరులో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజల జీవితాల్లో సమూల మార్పులు తెచ్చే రీతిలో వైఎస్ జగన్ సంక్షేమ పాలన అందిస్తే.. సామాన్య, మధ్యతరగతి ప్రజలను అ-ష్టకష్టాలు పెట్టే దిశగా కూటమి పాలన కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేసిన పాపాన పోలేదని ఆయన ఆరోపించారు. ఒకవైపు జగన్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ అటకెక్కించారని విమర్శించారు. మరో వైపు నింగినంటిన నిత్యావసరాల ధరలతో ప్రజలు "ఏం కొనేటట్లు లేదు - ఏం తినేటట్లు లేదు" అని నిందించారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా మళ్ళీ రాష్ట్రంలో జగనన్న పాలన "రావాలి - కావాలి" అని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు. "వైసీపీ గెలుపు - ప్రగతికి మలుపు" అని నిర్ధారణకు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మందపాటి శేషగిరిరావు, రాతంశెట్టి సీతారామాంజనేయులు, బందా రవీంద్రనాథ్, నూనె కోటిరెడ్డి, నూనె ఉమామహేశ్వరరెడ్డి, సూదులగుంట శ్రీలక్ష్మి, శివాలశెట్టి రాదా, పిల్లి నాగేశ్వరరావు, రామకోటేశ్వరరావు, మురళి, జీవరత్నం, ఉమామహేశ్వరరావు, గణేష్, జానీ, మాబుబాషా, అనిల్ కుమార్, జ్యోత్స్న, శ్రీదేవి, పలకలూరి వీరయ్య, హుస్సేన్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణకు వాటర్ ప్రూఫ్ టెంట్‌లు ఏర్పాటు చేయాలి

గుంటూరు, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): నవంబరు 2,3 తేదీల్లో భారీ వర్ష సూచన ఉందని, ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలకు వాటర్ ప్రూఫ్ టెంట్ లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ అధికారులతో శుక్రవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామగ్రి తడిచిపోకుండా ప్లాస్టిక్ కవర్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ రోజున 20 సెంటీ మీటర్ల మేర వర్షపాతం ఉంటుందని సూచనలు ఉన్నాయని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ లు, కౌంటింగ్ రూమ్ ల వద్ద వాటర్ లీకేజీ లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాల వద్ద, పోలింగ్ కేంద్రాల వద్ద నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, పార్కింగ్ స్థలం వద్ద బురద ఉండకూడదని అందుకు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని ఆదేశించారు. నీరు నిలువ ఉండే పరిస్థితి ఉంటే తక్షణం బయటకు పంపించుటకు అవసరమైతే ఆయిల్ ఇంజన్ మోటర్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎక్కడా ఎన్నికల వాహనాలు, బస్సులు నిలువరాదని, ట్రాఫిక్ రద్దీ జరగరాదని, వాహనాలు కూరుకుపోరాదని స్పష్టం చేశారు. ఎన్నికల సిబ్బందికి గొడుగులు అందించాలని ఆదేశించారు.

ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఎవరూ ఉండరాదని, 48 గంటల ముందు మద్యం విక్రయాలపై నిషేధం అమలు పక్కాగా అమలు కావాలన్నారు. బి.ఎన్.ఎస్ 163 పకడ్బందీగా అమలు చేయాలని, తహశీల్దార్లు వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్లు లోపల ఎవరు ఉండరాదన్నారు. వంద మీటర్ల తరువాత కూడా ఓటరును ప్రభావితం చేసే అంశాలు ఉండరాదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఏ వ్యక్తి పార్టీల కండువాలతో వెళ్ళరాదన్నారు. ప్రజా ప్రతినిధులతో గన్ మెన్ లు వెళ్ళరాదని చెప్పారు. పోలింగ్ రోజు, నవంబరు 1వ తేదీన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా వేతనంతో కూడిన సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. మీడియా ప్రతినిధులు ఎన్నికల అధికారుల సూచనలు పాటించాలన్నారు. ఓటు హక్కు గోప్యతను విధిగా పాటించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రంలో ఎటువంటి ఇంటర్వ్యూలు నిర్వహించరాదని తెలిపారు. సున్నిత, అతి సున్నితమైన పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు పక్కాగా జరగాలని ఆదేశించారు. బయట వీడియోగ్రాఫీ చేయాలని ఆదేశించారు.

జెడ్.పీ.టీ.సీ, ఎం.పీ.టీ.సీ ఎన్నికలకు సైతం వర్షాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

నవంబరు 2, 3 తేదీల్లో భారీ వర్షాలు... అప్రమత్తంగా ఉండాలి

నవంబరు 2,3 తేదీల్లో భారీ వర్ష సూచన ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు ముందస్తు సలహాలు అందించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అన్ని మండలాలలో కంట్రోల్ రూమ్ లు తక్షణం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైతే వెంటనే పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించాలని స్పష్టం చేశారు. రేయింబవళ్ళు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల 08632234014 కంట్రోల్ రూమ్ కు వెంటనే సమాచారం అందించాలని కోరారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్ ఎం.గంగరాజు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి జి.శ్రీనివాస్, ఆర్ అండ్ బి రహదారులు భవనాలు శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ సి.విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి

○ భట్టిప్రోలు, అమృతలూరులో నక్కా ఆనందబాబు ఇంటింటి ప్రచారం

వేమూరు,అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వేమూరు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు కూటమి అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. భట్టిప్రోలు మండలం పెదపులివర్రు, గోరికపూడి గ్రామాలతో పాటు అమృతలూరు మండలం మూల్పూరు గ్రామంలో కూటమి నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

పెదపులివర్రులో భట్టిప్రోలు జడ్పీటీసీ కూటమి అభ్యర్థి నక్కా శ్రీనివాసరావు, ఎంపీటీసీ అభ్యర్థి బుస్సా విజయలక్ష్మికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం గోరికపూడిలో జనసేన ఎంపీటీసీ అభ్యర్థి బచు రాధాకృష్ణకు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. జనసేన అభ్యర్థికి గ్లాస్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

మూల్పూరులో విస్తృత ప్రచారం

అమృతలూరు మండలం మూల్పూరు గ్రామంలో మూల్పూరు-1 ఎంపీటీసీ అభ్యర్థి బాణాల చైతన్య, మూల్పూరు-2 ఎంపీటీసీ అభ్యర్థి మండూరు రాధారాణి, అమృతలూరు జడ్పీటీసీ అభ్యర్థి పల్లెంపాటి బాలాజీకి మద్దతుగా నక్కా ఆనందబాబు ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.

వేమూరు నియోజకవర్గంలోని వివిధ ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు.

టీడీపీ అభ్యర్థులకు సైకిల్, జనసేన అభ్యర్థులకు గ్లాస్, బీజేపీ అభ్యర్థులకు కమలం గుర్తులపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచార కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల గౌరవ వేతనాలు వెంటనే చెల్లించాలి

○ జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్

అమరావతి, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): ప్రభుత్వ పాఠశాలల్లో సెప్టెంబర్ నెల నుంచి విధులు నిర్వహిస్తున్న అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్ ప్రభుత్వాన్ని కోరారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను కాంట్రాక్టు విధానంలో 2027 ఏప్రిల్ వరకు పనిచేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఇందులో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్లకు నెలకు రూ. 10 వేల చొప్పున, స్కూల్ అసిస్టెంట్లకు నెలకు రూ. 12,500 చొప్పున గౌరవ వేతనం చెల్లించాల్సి ఉందన్నారు.

అయితే సెప్టెంబర్ నెలకు సంబంధించిన గౌరవ వేతనం కూడా ఇంతవరకు చెల్లించకపోవడం వల్ల అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని షరీఫ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధనా సేవలు అందిస్తున్న చిరుద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.

పెండింగ్‌లో ఉన్న సెప్టెంబర్ నెల గౌరవ వేతనంతో పాటు తదుపరి నెలల వేతనాలను కూడా ఎప్పటికప్పుడు చెల్లించేలా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్.ఎం. షరీఫ్ విజ్ఞప్తి చేశారు. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం కల్పించాలని ఆయన కోరారు.

రాష్ట్రంలో 16 మాదకద్రవ్యాల వ్యసన విముక్తి కేంద్రాల ఆధునికీకరణ

○ రూ.9.86 కోట్ల విడుదల

అమరావతి, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు వ్యసన బాధితులకు మెరుగైన వైద్య చికిత్స, కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 16 ప్రభుత్వాసుపత్రుల్లో నడిచే 16 మాదకద్రవ్యాల వ్యసన విముక్తి కేంద్రాలను రూ. 9.86 కోట్లతో ఆధునికీకరించనుంది. మద్య నిషేధ, ఎక్సైజ్ శాఖ తాజాగా విడుదల చేసిన నిధులతో ఈ అభివృద్ధి పనులు జరుగనున్నాయి. క్షేత్రస్థాయిలో వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రధాన ప్రాంతీయ ఆసుపత్రుల్లో అత్యాధునిక వైద్య చికిత్స, పునరావాస సేవలు అందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ కేంద్రాల్లో భవనాల మరమ్మతులు, గదుల విభజన, అద్దాల తలుపుల ఏర్పాటు, విద్యుత్ వ్యవస్థల బలోపేతం, ఆధునిక ఫర్నిచర్ ఏర్పాటు చేయనున్నారు. బయో ఫీడ్‌బ్యాక్ యంత్రాలు, శ్వాస పరీక్ష పరికరాలు, మల్టీ పారామీటర్ మానిటర్లు, ఈసీజీ యంత్రాలతో పాటు డిజిటల్ సమాచార సాంకేతిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

వైద్య విద్యా శాఖ పరిధిలోని 10 ప్రభుత్వ బోధన, ప్రధాన ఆసుపత్రుల్లో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, తిరుపతి ఎస్వీఆర్ఆర్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, రాజమండ్రి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, విశాఖపట్నం కింగ్ జార్జి ఆసుపత్రి, కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పరిధిలోని మానసిక వైద్యశాలను ఈ కార్యక్రమంలో చేర్చారు. వీటిలో విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, విశాఖపట్నం కింగ్ జార్జి ఆసుపత్రి, కడప మానసిక వైద్యశాలను ప్రత్యేక వైద్య సేవల కేంద్రాలు(ఎక్సలెన్సీ)గా అభివృద్ధి చేయనున్నారు. ఈ మూడు ప్రాంతీయ కేంద్రాల్లో అత్యున్నత వైద్య చికిత్స, వ్యసన విముక్తికి అవసరమైన ప్రత్యేక వైద్య సేవలు, పునరావాస సహాయాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు.

జిల్లా, ఏరియా ఆసుపత్రుల్లోని కేంద్రాలు కూడా

వీటితో పాటు మరో ఆరు జిల్లా, ఏరియా ఆసుపత్రుల్లోనూ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. అనకాపల్లి జిల్లా ఆసుపత్రి, నరసాపురం ఏరియా ఆసుపత్రి, నరసరావుపేట ఏరియా ఆసుపత్రి, చిత్తూరు జిల్లా ఆసుపత్రి, హిందూపురం జిల్లా ఆసుపత్రి, బాపట్ల ఏరియా ఆసుపత్రుల్లో భవన, విద్యుత్ సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. తద్వారా ప్రాంతీయ, మారుమూల ప్రాంతాల్లోనూ వ్యసన విముక్తి సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

కూటమికి ఓటేయండి.. నిడదవోలు అభివృద్ధిలో భాగస్వామ్యులు కండి : మంత్రి దుర్గేష్

○ నిడదవోలు పట్టణంలో ఘనంగా ముగిసిన కూటమి ఎన్నికల ప్రచారం

○ 32 వార్డుల్లో ప్రచార రథంపై మంత్రి దుర్గేష్, టీడీపీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావుల విస్తృత పర్యటన

నిడదవోలు, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): నవంబర్ 1వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా నిడదవోలు పట్టణంలో కూటమి శ్రేణులు నిర్వహించిన ఎన్నికల ప్రచారం జాతరను తలపించింది. మంత్రి కందుల దుర్గేష్, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో నిడదవోలు క్యాంపు కార్యాలయం నుండి పట్టణంలోని 32 వార్డుల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార రథంపై మంత్రి కందుల దుర్గేష్, శేషారావులు పర్యటిస్తూ ప్రజలకు అభివాదం చేశారు. అంతకుముందు ఎన్నికల ప్రచారంలో భాగంగా 3, 5, 6, 7, 8, 9, 10, 13, 14, 15, 16, 21, 32 వార్డుల్లో మంత్రి దుర్గేష్, శేషారావులు స్వయంగా ఇంటింటికీ తిరుగుతూ కూటమి అభ్యర్థులు గుడ్ల వెంకట నారాయణ(టీడీపీ), వంగా మాధవి(జనసేన), తురుగోపు సాగర్(జనసేన),గుర్రపు శాంతిశ్రీ(జనసేన), గంగుల వెంకట లక్ష్మి(జనసేన), అంగర లక్ష్మి(టీడీపీ),షకీనా అన్నారి బేగం(టీడీపీ),బయ్యా రామలక్ష్మి(జనసేన),బోజ కృష్ణ(టీడీపీ), కేదారిశెట్టి హారిక (జనసేన),బలిజేపల్లి వెంటక బదిరి లక్ష్మి వైశాలి(బీజేపీ),అస్మత్ ప్రసన్న లక్ష్మి (టీడీపీ), బొల్లా శ్రీనివాస్ గౌడ్(టీడీపీ) లను ప్రజలకు పరిచయం చేసి కూటమిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

జయహో కూటమి.. పండగ వాతావరణంలో ప్రచారం

ప్రచార రథంపై నుండి మంత్రి దుర్గేష్ తనదైన శైలిలో ప్రజలను ఆకట్టుకున్నారు. మైకులో షాపుల పేర్లు, దుకాణాల్లో ఉన్న వ్యాపారులు, పౌరుల పేర్లను స్వయంగా చదువుతూ పేరుపేరునా పలకరించడం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. కూటమి శ్రేణుల "జయహో కూటమి" నినాదాలతో నిడదవోలు వీధులన్నీ మారుమోగాయి. ఈ సందర్భంగా చారిత్రాత్మక నిరవద్యపురానికి (నిడదవోలు) పూర్వ వైభవం తీసుకువచ్చి, రాష్ట్రంలోనే నంబర్ 1 నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు తమకు మద్దతు ఇవ్వాలని మంత్రి కందుల దుర్గేష్ చేతులు జోడించి పట్టణ ప్రజలను అభ్యర్థించారు.

ఎన్నికల నిబంధనల ప్రకారం సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగించే ముందు స్థానిక గణేష్ చౌక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గడిచిన రెండున్నరేళ్ల పాలనలోనే నిడదవోలు పట్టణాభివృద్ధికి రూ. 195 కోట్లు ఖర్చు చేశాం. విశాలమైన రహదారులు, సీసీ రోడ్లు, రైల్వే స్టేషన్ రోడ్డులో సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చాం. మాలకోడు చెరువును రూ. 5 కోట్లతో వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్ పార్క్, వాటర్ ఫౌంటేన్‌లతో నందనవనంగా తీర్చిదిద్దుతున్నాం. పట్టణంలో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నాం. శెట్టిపేట గోదావరి కెనాల్ వద్ద బోటింగ్, వే-సైడ్ రెస్టారెంట్, చిల్డ్రన్ పార్క్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. నిడదవోలు చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించేలా చినకాశీరేవును బాగు చేస్తున్నాం. ప్రసిద్ధ శ్రీ కోటసత్తెమ్మ తల్లి దేవాలయంలో భక్తుల కోసం మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.

ప్రచారానికి ముందు పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిసెంబర్ నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయిన వెంటనే ఎస్సీ కమ్యూనిటీ హాల్, అంబేద్కర్ ప్రాంగణాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు..

వైకాపా విధ్వంసక పాలనపై విమర్శలు

గత వైకాపా ప్రభుత్వ బాధ్యతా రాహిత్యాన్ని మంత్రి దుర్గేష్ ప్రచారంలో తీవ్రస్థాయిలో ఎండగట్టారు..గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్వోబీని శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తే, ఐదేళ్ల అధికారాన్ని వెలగబెట్టిన వైకాపా ఆ బ్రిడ్జిని ఎందుకు పూర్తి చేయలేకపోయిందని నిలదీశారు. ఈ రోజు మేము వచ్చి పనులను శరవేగంగా ముందుకు తీసుకెళ్తుంటే అసూయతో కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. వైకాపా నాయకులకు ధైర్యముంటే ఆర్వోబీ నిర్మాణంపై నాతో బహిరంగ చర్చకు రాగలరా? అని సవాల్ విసిరారు.. రాబోయే మార్చి నాటికి పుష్కరాల కంటే ముందే ఆర్వోబీని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని స్పష్టం చేశారు..

టీడీపీ ప్రభుత్వంలో 1,052 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి నిర్మాణాలు చేపడితే, కూటమికి పేరు వస్తుందనే నెపంతో వైకాపా ఐదేళ్లపాటు ఆ ఇళ్లను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసింది. త్వరలోనే రూ. 8.80 కోట్లతో మౌలిక వసతులు కల్పించి, 6 నెలల్లో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను అందజేస్తామని స్పష్టం చేశారు.

మాలకోడు చెరువులో గుర్రపుడెక్క (తూటికాడ) తొలగించాలనే కనీస జ్ఞానం కూడా గత ప్రభుత్వానికి లేకపోయిందని, కనీసం వారి హయాంలో మాలకోడు ఆధునికీకరణను చేపట్టాలనే ఇంగితజ్ఞానం కూడా వైసీపీ నాయకులకు లేకపోయిందని విమర్శించారు. అభివృద్ధి చేయడం చేతకాక, మేము చేస్తున్న పనిపై అనవసరపు బురద జల్లడం వైకాపా నెగెటివ్ రాజకీయానికి నిదర్శనమని ఫైర్ అయ్యారు..

."కొత్త పెన్షన్లు రావాలన్నా, టిడ్కో ఇళ్లు సిద్ధం కావాలన్నా, నూతన ఇళ్ల నిర్మాణంతో పాటు మౌలిక వసతులు, రహదారుల విస్తరణ జరగాలన్నా అది ఒక్క కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం. చారిత్రక నిరవద్యపురానికి గత వైభవాన్ని తెచ్చి తీరుతామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల మార్గదర్శకత్వంలో అందుతున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయికి చేరాలంటే మున్సిపాలిటీలో కూటమి విజయం సాధించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఛైర్‌పర్సన్ అభ్యర్థికి గాజు గ్లాసు గుర్తుపై, వార్డు అభ్యర్థులకు సైకిల్, గాజు గ్లాసు, కమలం గుర్తులపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి దుర్గేష్ అభ్యర్థించారు. తనను గెలిపించిన నిడదవోలు ప్రజల రుణం తీర్చుకునేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నానని, స్థానికులు ఏ సమస్య నా దృష్టికి తెచ్చినా వెంటనే పరిష్కరిస్తున్నాను. త్వరలోనే శంకుస్థాపన చేసిన పలు అభివృద్ధి పనులను ఎన్నికల అనంతరం వేగవంతం చేసి చూపిస్తాం" అని మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.

ఎలియేషన్‌లో రూ.9.6 లక్షల వార్షిక వేతనంతో ఎన్ఆర్ఐ విద్యార్థికి ఉద్యోగం

○ విద్యార్థి జగదీష్ ప్రతిభకు కళాశాల యాజమాన్యం అభినందనలు

గుంటూరు, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈవీటీ విభాగానికి చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థి తోళ్లమడుగు జగదీష్ ప్రముఖ ఎలియేషన్ సంస్థలో రూ. 9.6 లక్షల వార్షిక వేతన ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామక ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను ప్రదర్శించి ఈ అవకాశాన్ని సాధించాడు.

జగదీష్ విజయంపై కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కళాశాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. శరత్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సంజయ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి. సీతారామయ్య, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జీవన, ప్లేస్‌మెంట్ విభాగానికి చెందిన మౌలాలి తదితరులు జగదీష్‌ను అభినందించారు.

ఈ సందర్భంగా కె. శరత్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు కళాశాల ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ప్రముఖ సంస్థల్లో విద్యార్థులు ఉన్నత వేతనాలతో ఉద్యోగాలు సాధించడం కళాశాలకు గర్వకారణమని తెలిపారు.

ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, తిలక్ బాబు, డాక్టర్ డి. సంజయ్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధనతో లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఉన్నత ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులతో పాటు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జీవన మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక శిక్షణతో పాటు వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఇంటర్వ్యూ సన్నద్ధత వంటి అంశాల్లో నిరంతరం శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో రాణించేందుకు దోహదపడుతోందన్నారు.

ఎలియేషన్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ తమ సంస్థ హైదరాబాద్, బెంగళూరులో కార్యకలాపాలు నిర్వహిస్తోందని తెలిపారు. విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై నిరంతరం అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక రంగంలో నైపుణ్యాలు కలిగిన విద్యార్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

రూ. 9.6 లక్షల వార్షిక వేతన ప్యాకేజీతో ఉద్యోగం సాధించిన జగదీష్‌ను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకుని విజయ శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించింది.

ఏపీకి నేడు కేంద్ర బృందం..

తుపాను నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలన

అమరావతి, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): అర్నబ్ తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన నష్టాన్ని అంచనా వేసేందుకు, అదే సమయంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నెలకొన్న కరవు పరిస్థితులను పరిశీలించేందుకు రెండు వేర్వేరు కేంద్ర బృందాలు రాష్ట్రానికి రానున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ శుక్రవారం వెల్లడించారు.

కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల కేంద్ర బృందం శని, ఆదివారాల్లో (అక్టోబర్ 31, నవంబర్ 1) తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తుంది. రియల్-టైమ్ గవర్నెన్స్ సెంటర్‌లో తుపాను సమయంలో తీసుకున్న చర్యలు, నష్టంపై అధికారులు కేంద్ర బృందానికి వివరించనున్నారు. అనంతరం ఈ బృందం రెండుగా విడిపోయి క్షేత్రస్థాయిలో పర్యటిస్తుంది. ఒక బృందం కోనసీమ, కాకినాడ జిల్లాల్లో, రెండో బృందం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో నష్టాన్ని పరిశీలిస్తుంది. ఈ బృందం సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం కానుంది.

ఇదిలా ఉండగా, 2026 ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న కరవు పరిస్థితులను అంచనా వేసేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ చిన్మయ్ గోట్మారే నేతృత్వంలోని మరో బృందం నవంబర్ 2, 3 తేదీల్లో రాష్ట్రంలో పర్యటిస్తుంది. పది మంది సభ్యులున్న ఈ బృందం రెండుగా విడిపోయి శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించి రైతులు, అధికారులతో మాట్లాడనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 283 మండలాలను తీవ్ర కరవు, 105 మండలాలను మధ్యస్థ కరవు ప్రాంతాలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ బృందం నవంబర్ 4న ముఖ్యమంత్రితో భేటీ కానుంది.

సర్వజన ఆసుపత్రుల్లో ఐసీయూల బలోపేతానికి ఆదేశాలు

○ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చర్యల పూర్తికి గడువుల నిర్దేశం

అమరావతి, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ల (ఐసీయూ)ను నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేయాలని వైద్య విద్యా సంచాలకులు ఏ. విష్ణువర్ధన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐసీయూల్లో మౌలిక సదుపాయాల కల్పన, అత్యవసర వైద్య పరికరాల కొనుగోలు, నిపుణులైన వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది నియామకాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆసుపత్రుల సూపరింటెండెంట్లను ఆదేశించారు.

సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు: సుప్రీంకోర్టు 2026 సెప్టెంబరు 21న జారీ చేసిన ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సేవల డైరెక్టర్ జనరల్ రూపొందించిన ఐసీయూల నిర్వహణ, సేవల మార్గదర్శకాలను అమలు చేయాలి. ఇందులో భాగంగా ఐసీయూ స్థాయి-1కు సంబంధించిన మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాలు, సిబ్బంది నియామకాలకు ప్రత్యేక గడువులు నిర్దేశించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు 9 నెలలు: ఇప్పటికే ఉన్న ఐసీయూల స్థానం, పరిమాణం, నిర్మాణంలో అవసరమైన మార్పులు చేసేందుకు 9 నెలల గడువు ఇచ్చారు. పడకల వద్ద అవసరమైన సదుపాయాలను మూడు నెలల్లోగా ఏర్పాటు చేయాలి. నర్సింగ్ స్టేషన్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనను 9 నెలల్లోగా పూర్తి చేయాలి.

వైద్య పరికరాల కొనుగోలుకు మూడు నెలలు: అత్యవసర వైద్య పరికరాల కొనుగోలుకు సంబంధించిన ప్రక్రియతోపాటు కొనుగోలు, సరఫరా ఉత్తర్వులను మూడు నెలల్లోగా పూర్తి చేయాలి. పరికరాల సరఫరా, ఏర్పాటు పరిస్థితులను బట్టి మరో మూడు నెలల వరకు గడువు ఉంటుంది. చిత్రీకరణ పరీక్షలకు అవసరమైన పరికరాల కొనుగోలు ప్రక్రియను మూడు నెలల్లోగా పూర్తి చేసి, వాటి ఏర్పాటుకు మరో మూడు నెలల వరకు అవకాశం ఉంటుంది. అత్యవసరం కాని వైద్య పరికరాల కొనుగోలు, ప్రయోగశాల సేవలకు సంబంధించిన ఏర్పాట్లను మూడు నెలల్లోగా పూర్తి చేయాలి.

ఇన్ఫెక్షన్ నియంత్రణ, భద్రతకు తక్షణ చర్యలు: ఐసీయూల్లో ఇన్ఫెక్షన్ నియంత్రణ, రోగుల భద్రతకు సంబంధించిన మార్గదర్శకాలను తక్షణమే అమలు చేయాలి. అదనపు సేవల ఏర్పాటుకు నెల రోజుల గడువు ఇచ్చారు.

ఐసీయూల నిర్వహణకు అవసరమైన నిపుణులైన వైద్యులు, శిక్షణ పొందిన ఎంబీబీఎస్ వైద్యులు, నర్సులు, ఇతర అనుబంధ ఆరోగ్య సిబ్బంది నియామకాలను తక్షణమే ప్రారంభించి ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. వైద్య సేవలకు సంబంధించిన రికార్డుల నిర్వహణ, తనిఖీలను తక్షణమే చేపట్టాలి.

స్థాయి-2, స్థాయి-3 ఐసీయూలకు ప్రత్యేక ప్రమాణాలు

ఐసీయూ స్థాయి-1 మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలి. అయితే ప్రతి ఆసుపత్రిలో స్థాయి-2, స్థాయి-3 ఐసీయూలు ఉండటం తప్పనిసరి కాదు. ఆయా స్థాయిలకు నిర్దేశించిన అన్ని ప్రమాణాలను పూర్తిగా పాటించినప్పుడే ఆ స్థాయి ఐసీయూలుగా గుర్తించాలి. ప్రమాణాలు పూర్తికాని ఆసుపత్రులను అమలైన సదుపాయాల స్థాయికి అనుగుణంగా వర్గీకరించి పేరు మార్చాలి. అత్యుత్తమ వైద్య సేవలు అందించే ఆసుపత్రులు, ప్రత్యేక వైద్య ఆసుపత్రుల్లో స్థాయి-1 ప్రమాణాలతోపాటు స్థాయి-3 ఐసీయూ సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలి.

గుంటూరు అభివృద్ధికి అండగా నిలవండి.. లక్ష్మీ అపర్ణను గెలిపించండి

○ గుంటూరు అభివృద్ధి కొనసాగాలంటే లక్ష్మీ అపర్ణకు అండగా నిలవాలి

○ రూ.626 కోట్లతో నగరపాలక సంస్థ ద్వారా నగరంలో అభివృద్ధి పనులు

గుంటూరు, అక్టోబర్ 30(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో తూర్పు నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీకి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రచార ర్యాలీ ఎన్నికల కార్యక్రమంలా కాకుండా, ముందస్తు విజయోత్సవ ర్యాలీని తలపించేలా సాగింది. ప్రజల ఉత్సాహం, కార్యకర్తల సందడి ప్రచారానికి మరింత ఊపునిచ్చాయి.

ఈ సందర్భంగా మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ నగర ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ "గుంటూరు నగర ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. నేను మీ లక్ష్మీ అపర్ణ కోవెలమూడిని. నవంబర్ 1వ తేదీన జరగనున్న గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాను.

గుంటూరు నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా మా కుటుంబం గతంలోనూ ప్రజలకు సేవలందించింది. అదే సేవాభావంతో భవిష్యత్తులోనూ నగర అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇస్తున్నాను.

ఈ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాకు, అలాగే 76 డివిజన్లలో పోటీ చేస్తున్న ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మీ అమూల్యమైన ఓటు వేసి మద్దతు తెలియజేయాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. మీ ఆశీస్సులు, ఆదరణ, సహకారం ఎల్లప్పుడూ మాపై ఉండాలని ఆకాంక్షిస్తున్నాను" అని కోరారు.

రూ.626 కోట్లతో నగర అభివృద్ధి పనులు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో సుమారు రూ. 626 కోట్ల అంచనా వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. రహదారుల అభివృద్ధి, పార్కుల ఆధునీకరణ, స్ట్రీట్ లైటింగ్, పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపు వంటి కార్యక్రమాలు నగర రూపురేఖలను మార్చే దిశగా కొనసాగుతున్నాయి. 'నవ గుంటూరు' లక్ష్యం కేవలం బోర్డులకే పరిమితం కాకుండా, అభివృద్ధి పనుల ద్వారా వాస్తవ రూపంలో కనిపించాలంటే ఈ కార్యక్రమాలకు కొనసాగింపు అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కూటమి ప్రభుత్వ హయాంలో గుంటూరులో అభివృద్ధి పనులు

వైద్య రంగం నుంచి క్రీడా ప్రాంగణాల వరకు.. గుంటూరు నగర అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోంది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, మౌలిక సదుపాయాల కల్పన, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదల దిశగా పలు కార్యక్రమాలు చేపడుతోంది.

క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ. 20 కోట్లతో పీఈటీ స్కాన్ సదుపాయం కల్పించడంతో పాటు, ఓఎన్‌జీసీ సహకారంతో రూ. 30 కోట్ల విలువైన రేడియోథెరపీ పరికరాన్ని ఏర్పాటు చేశారు. అత్యవసర వైద్య సేవల కోసం రూ. 1.5 కోట్లతో 15 వెంటిలేటర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పనిచేయని ఏసీలు, లిఫ్టులు, సీటీ స్కాన్ పరికరాలను పునరుద్ధరించడంతో పాటు ల్యాబ్ సేవలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టారు.

అదేవిధంగా గుంటూరులో రూ. 20 కోట్లతో ఆధునిక లైబ్రరీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. బీఆర్ స్టేడియాన్ని రూ. 14 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడంతో పాటు, గుంటూరు పరిసర ప్రాంతాల్లో చెరువులు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నగరంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు.

కేంద్ర నిధులతో రూ.700 కోట్ల రైల్వే ప్రాజెక్టులు

మరోవైపు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో గుంటూరు పార్లమెంట్ పరిధిలో దాదాపు రూ. 700 కోట్లతో, 100 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో పలు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రైల్వే క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుంది. ప్రజలందరూ గమనించి కూటమి ప్రభుత్వం బలపరిచిన మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ గారికి ఓటు వేసి అలాగే 76 డివిజన్ల కార్పొరేట్ అభ్యర్థులకు ఓట్లు వేసి అఖండ మెజారిటీ కల్పించాలని కూటమి నాయకులు కోరారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com